పత్రికతో.. మార్పులు

APTEL/25/A1880

# TN తెలుగు న్యూస్

దిన పత్రిక

మా కలం మీ గళం.. సామాన్యుని గుండె చప్పుడు..

సంపుటి : 1 సంచిక : 701 పబ్లిషర్స్ & చీఫ్ ఎడిటర్ : యన్. కృష్ణారావు ఎడిటర్ : ఎస్. మస్తాన్ శనివారం 29.08.2026 పేజీలు : 7 వెల : 4/-



## ఒంగోలులో మహనీయుల స్ఫూర్తి..
## 20 విగ్రహాలను ఆవిష్కరించిన మంత్రి

- జిల్లా సంస్కృతికి ప్రతీకగా ఒంగోలు గిత్త విగ్రహం ఆవిష్కరణ
- మహనీయుల సేవలను భావితరాలకు తెలియజేయడమే లక్ష్యమన్న లోకేశ్
- కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఇతర ప్రముఖులు
- వివిధ రంగాలకు చెందిన మహనీయుల విగ్రహాలను ఒకే చోట ఏర్పాటు

2లో

## నియోజకవర్గాల విజన్ ప్లాన్..
# పనితీరుకు అదే ప్రామాణికం: సీఎం

### ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులతో చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్

- ప్రజాప్రతినిధులు నిరంతరం సమీక్షలు జరుపుతూ ప్రజలకు జవాబుదారీగా ఉండాలని ఆదేశం
- అన్ని స్థాయిల్లో పొలిటికల్ గవర్నెన్స్, ప్రజా భాగస్వామ్యంతోనే మెరుగైన ఫలితాలు
- టెక్నాలజీని వాడుకుంటూ వినూత్నంగా ఆలోచించాలని సూచన
- రాష్ట్ర విజన్ ప్లాన్ యూనిట్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందని వెల్లడి



అమరావతి, ఆగస్టు 28 : రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపడం, పేదరిక రహిత సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'స్వర్ణ నియోజకవర్గం విజన్ యాక్షన్ ప్లాన్' పనితీరుకు ప్రామాణికంగా నిలుస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ ప్రణాళిక అమలులో ప్రజాప్రతినిధులు, అధికారులు కీలక పాత్ర పోషించాలని, ప్రజల భాగస్వామ్యంతోనే అద్భుత ఫలితాలు సాధించగలమని ఆయన దిశానిర్దేశం చేశారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గాల విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్లపై ముఖ్యమంత్రి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లతో పాటు యంగ్ ప్రొఫెషనల్స్, నాలెడ్జ్ పార్ట్‌నర్స్‌తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు.

తరువాయి 2లో



## దీర్ఘకాలిక నొప్పికి ..
## మెదడులోనే స్విచ్ఛాఫ్ బటన్

2లో

- ప్రతి వ్యక్తి మెదడును మ్యాపింగ్ చేసి నొప్పి సంకేతాల నియంత్రణ
- ముగ్గురు రోగులపై పరీక్షించగా ఇద్దరిలో సత్ఫలితాలు
- ఒక మహిళకు శాశ్వత ఇంప్లాంట్‌తో ఏడాదిగా నొప్పి నుంచి ఉపశమనం
- స్టాన్‌ఫోర్డ్ శాస్త్రవేత్తల పరిశోధనలో వెల్లడైన కీలక విషయాలు
- పరిశోధన వివరాలు 'బ్రెయిన్ స్టిమ్యులేషన్' జర్నల్‌లో ప్రచురితం

### తెలంగాణలో అంగన్‌వాడీ ఉద్యోగాల జాతర
## ఇంటర్ అర్హతతో 15,982 పోస్టుల భర్తీ





- సెప్టెంబర్ నాటికి నియామకాలు పూర్తి చేయాలని ప్రభుత్వ ఆదేశం
- ఇంటర్ పాసైన వారు అర్హులు, ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థుల ఎంపిక
- ఎంపికలో ఇంటర్ మార్కులకు 70 శాతం వెయిటేజీ
- రెండు జోన్ల పరిధిలో టీచర్లు, ఆయాల పోస్టుల భర్తీ

తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని నిరుద్యోగులకు శుభవార్త చెప్పింది. రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న భారీ సంఖ్యలో పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు మొత్తం 15,982 పోస్టులను సెప్టెంబర్ నెలలోగా భర్తీ చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

తరువాయి 2లో




### ఇంటింటికీ టీడీపీ: 90 లక్షల ఇళ్ల మైలురాయిని దాటిన కార్యక్రమం

- 33వ రోజూ విజయవంతంగా కొనసాగిన 'ఇంటింటికీ తెలుగుదేశం'
- ఇప్పటివరకు మొత్తం 90.55 లక్షల కుటుంబాలను సందర్శించిన శ్రేణులు
- ప్రభుత్వ పథకాలపై ప్రజలకు వివరిస్తూ, వారి సమస్యల సేకరణ

4లో



### ఆర్మీ జవాన్లకు రాఖీలు కట్టిన
## కశ్మీరీ యువతులు..

- సోషల్ మీడియాలో నెటిజన్ల ఫిదా
- సరిహద్దులను కాపాడుతున్న జవాన్లకు మిఠాయిలు తినిపించిన వైనం
- త్మీయానురాగానికి భావోద్వేగానికి గురైన సైనికులు

రక్షా బంధన్ పండుగను పురస్కరించుకుని జమ్మూకశ్మీర్‌లోని స్థానిక కశ్మీరీ యువతులు, పాఠశాల

తరువాయి 2లో

### 'నిప్పుతో చెలగాటం ఆడొద్దు'
## బ్రిటన్‌కు రష్యా స్ట్రాంగ్ వార్నింగ్



- ఉక్రెయిన్‌కు బ్రిటన్ క్షిపణి టెక్నాలజీ
- దీనిపై తీవ్రంగా స్పందించిన రష్యా

2లో

### ఒంగోలు తాగునీటికష్టాలకు చెక్...
## రంగరాయుడు చెరువు వద్ద కొత్త ప్రాజెక్టు

- ఒంగోలు నగరానికి 24 గంటల తాగునీటి సరఫరాకు శ్రీకారం
- అమృత్ 2.0 ప్రాజెక్టును ప్రారంభించిన మంత్రి నారా లోకేశ్
- రూ.424.42 కోట్ల అంచనా వ్యయంతో పథకం అమలు
- 51 వేలకు పైగా ఇళ్లకు కొత్తగా కనెక్షన్లు.. 605 కి.మీ. పైప్‌లైన్



ప్రకాశం జిల్లా ఒంగోలు నగర ప్రజల దశాబ్దాల తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం కీలక అడుగు వేసింది. నగరానికి 24 గంటల పాటు నిరంతరాయంగా తాగునీరు అందించే లక్ష్యంతో చేపట్టిన అమృత్ 2.0 ప్రాజెక్టుకు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ శ్రీకారం చుట్టారు. రంగరాయుడు చెరువు వద్ద రూ.424.42 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఈ పథకానికి ఆయన నేడు శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టులో భాగంగా ఒంగోలు నగరంలోని 35 డిస్ట్రిబ్యూషన్ జోన్లను పునర్వ్యవస్థీకరిస్తారు. మొత్తం 605.30 కిలోమీటర్ల పొడవున కొత్త పైప్‌లైన్ నెట్‌వర్క్‌ను నిర్మించి, 51,340 గృహాలకు నేరుగా సర్వీస్ కనెక్షన్లు ఇవ్వనున్నారు. దీని ద్వారా నగరంలోని ప్రతి ఇంటికీ నాణ్యమైన తాగునీరు అందనుంది. పెరుగుతున్న నగర జనాభా అవసరాలకు అనుగుణంగా ఈ ఆధునిక వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు

తరువాయి 2లో

# నియోజకవర్గాల విజన్ ప్లాన్.. పనితీరుకు అదే ప్రామాణికం: సీఎం

(మొదటిపేజీ తరువాయి)
నియోజకవర్గాల వారీగా నిర్దిష్ట విజన్ ప్లాన్‌ను రూపొందించుకుని అమలు చేయడం దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌లో ప్రప్రథమంగా జరుగుతోందని, ఈ వినూత్న కార్యక్రమానికి జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు లభించిందని ముఖ్యమంత్రి తెలిపారు. కీ పెర్ఫామెన్స్ ఇండికేటర్లకు అనుగుణంగా ప్రతి రంగంలో వృద్ధి సాధించేలా పనిచేయాలని ప్రజాప్రతినిధులకు సూచించారు. క్షేత్రస్థాయిలో నిర్వహించే సమీక్షలు మొక్కుబడిగా కాకుండా, ప్రజలకు పూర్తిగా జవాబుదారీగా ఉండేలా చూడాలని ఆదేశించారు. అన్ని స్థాయిల్లోనూ పొలిటికల్ గవర్నెన్స్ సమర్థవంతంగా అమలైనప్పుడే సుపరిపాలన సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ నిర్ణయాలు, అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వాములను చేసినప్పుడు అద్భుత ఫలితాలు వస్తాయని, ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నమైన భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి లభించిన ప్రజా స్పందనే ఇందుకు నిదర్శనమని గుర్తుచేశారు. ఈ విజన్ ప్లాన్ అమలులో యంగ్ ప్రొఫెషనల్స్, నాలెడ్జ్ పార్ట్‌నర్లు, స్వర్ణ కార్యాలయాల సిబ్బంది పాత్ర అత్యంత కీలకమని సీఎం పేర్కొన్నారు. సంప్రదాయ ధోరణి వీడి వినూత్నంగా ఆలోచించాలని, స్థానిక వనరులను సద్వినియోగం చేసుకుంటూ ఆయా నియోజకవర్గాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఇందుకోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'డేటా లేక్' లోని సమాచారాన్ని విశ్లేషించుకోవాలని, టెక్నాలజీని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని ఆదేశించారు. ఉద్యోగుల సామర్థ్యం పెంచేందుకు ఇప్పటికే 1.50 కోట్ల ఆన్‌లైన్ కోర్సులు పూర్తి చేశారని తెలిపారు. ప్రభుత్వ లక్ష్యం కేవలం నగదు బదిలీ కాదని, లబ్ధిదారులను ఆర్థికంగా నిలబెట్టి వారిలో సాధికారత తీసుకురావడమేనని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. P4 ప్రాజెక్టు ద్వారా పేదలకు అవసరమైన చేయూత అందిస్తున్నామని, ప్రతి నియోజకవర్గంలో తలసరి ఆదాయం పెంచడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తూ ప్రతి పేద కుటుంబానికి అండగా ఉంటామనే భరోసా కల్పించాలన్నారు. జిల్లాలకు, నియోజకవర్గాలకు వస్తున్న పరిశ్రమలు క్షేత్రస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించేలా (గ్రౌండింగ్) ప్రజాప్రతినిధులు, అధికారులు పూర్తిస్థాయిలో సహకరించాలని ఆదేశించారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు విద్య, వైద్యం భారంగా మారకుండా ఉండేందుకే 'తల్లికి వందనం', 'సంజీవని' వంటి పథకాలు తెచ్చామని సీఎం వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచడం వల్ల అదనంగా లక్ష మంది విద్యార్థులు చేరారని, ఇది వారి కుటుంబాలపై ఆర్థిక భారాన్ని తగ్గించిందని పేర్కొన్నారు. మెగా డీఎస్సీ ప్రక్రియకు అడ్డంకులు సృష్టించే ప్రయత్నాలు జరిగినా, పారదర్శకంగా పూర్తి చేసి నిరుద్యోగ యువతకు న్యాయం చేశామని, దీనిపై విమర్శలు వస్తే టీచర్లే స్వయంగా ఉద్యమించిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రజలను మెప్పించగలిగితే వారి నుంచి సహకారం కూడా అదే స్థాయిలో ఉంటుందని సీఎం ఉద్ఘాటించారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రి పయ్యావుల కేశవ్, ఆర్థిక, ప్రణాళిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పీయూష్ కుమార్, ఏపీఎస్‌డీపీఎస్ ఈడీ వీఆర్ అలపర్తి సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణలో అంగన్‌వాడీ ఉద్యోగాల జాతర

(మొదటిపేజీ తరువాయి)
ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, ఈ నియామకాలు జిల్లా స్థాయిలో జరగనున్నాయి. మొత్తం ఖాళీలలో జోన్ 1 పరిధిలో 1,853 టీచర్ పోస్టులు, 7,737 ఆయా పోస్టులు ఉన్నాయి. జోన్ 2 పరిధిలో 1,247 టీచర్ పోస్టులు, 5,145 ఆయా పోస్టులను భర్తీ చేయనున్నారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఇంటర్మీడియట్ (ఇంటర్) ఉత్తీర్ణులై ఉండాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ ఇంటర్వ్యూ ద్వారా జరగనుంది. ఎంపికలో భాగంగా అభ్యర్థుల ఇంటర్మీడియట్‌లో సాధించిన మార్కులకు 70 శాతం వెయిటేజీ ఇవ్వనున్నారు. ఇంటర్వ్యూకు 10 శాతం మార్కులు కేటాయించారు. అలాగే, ప్రత్యేక కేటగిరీల కింద వితంతువులకు 5 శాతం, అనాథలకు 10 శాతం, దివ్యాంగులకు 5 శాతం చొప్పున వెయిటేజీ కల్పించనున్నారు. ఈ నియామక ప్రక్రియను వేగవంతం చేసి, సెప్టెంబర్ నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఈ నిర్ణయంతో వేలాది మంది నిరుద్యోగ మహిళలకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

## 'నిప్పుతో చెలగాటం ఆడొద్దు' బ్రిటన్‌కు రష్యా స్ట్రాంగ్ వార్నింగ్

ఉక్రెయిన్‌కు బ్రిటన్ అందిస్తున్న సైనిక సాయం మరింత పెరగడంపై రష్యా తీవ్రంగా స్పందించింది. బ్రిటన్, ఫ్రాన్స్ తీరు ప్రమాదకరంగా మారుతోందని హెచ్చరించింది. తమ దేశానికి చెందిన స్టార్మ్ షాడో క్షిపణులను ఉక్రెయిన్‌లోనే తయారు చేసుకునేలా బ్రిటన్ సాంకేతిక పరిజ్ఞానం అందించనుంది. ఈ నిర్ణయం యుద్ధాన్ని మరింత తీవ్రం చేసే అవకాశం ఉందని రష్యా ఆందోళన వ్యక్తం చేసింది. రష్యా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మరియా జఖరోవా బ్రిటన్, ఫ్రాన్స్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రెండు దేశాలు 'నిప్పుతో చెలగాటం ఆడుతున్నాయి' అని హెచ్చరించారు. బ్రిటన్ ఆయుధాలతో జరిగే దాడులకు ప్రతిస్పందన తప్పదని స్పష్టం చేశారు. ఉక్రెయిన్‌లోనే స్టార్మ్ షాడో క్షిపణులను తయారు చేసుకునే సాంకేతికతను బ్రిటన్ ఇవ్వనుందని లండన్ ప్రకటించింది. దీంతో పాశ్చాత్య దేశాల నుంచి క్షిపణుల సరఫరాపై ఉక్రెయిన్ ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుంది. సుదూర ప్రాంతాల్లో దాడులు చేసే సామర్థ్యం పెరుగుతుంది. బ్రిటన్ ఆయుధాలతో జరిగే దాడులకు ప్రతిగా ఉక్రెయిన్‌లోనే కాకుండా ఇతర ప్రాంతాల్లో ఉన్న బ్రిటన్ సైనిక స్థావరాలపైనా దాడులు జరిగే అవకాశం ఉందని జఖరోవా హెచ్చరించారు. ఈ వ్యాఖ్యలు బ్రిటన్‌రష్యా మధ్య ఉద్రిక్తతలను మరింత పెంచే అవకాశం ఉంది. ఇదే సమయంలో రష్యానాటో మధ్య ఉద్రిక్తతలపైనా చర్చ జరుగుతోంది. రష్యా నాటో సభ్యదేశంపై పరిమిత దాడికి ప్రయత్నించే అవకాశం ఉందన్న అమెరికా నిఘా అంచనాలపై వార్తలు వచ్చాయి. అయితే ఈ ఆరోపణలను రష్యా ఖండించింది. నాటోతో తలపడేందుకు తమ దేశం సిద్ధమవుతోందన్న ప్రచారంలో వాస్తవం లేదని క్రెమ్లిన్ స్పష్టం చేసింది.

## ఒంగోలు తాగునీటి కష్టాలకు చెక్...

(మొదటిపేజీ తరువాయి)
తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, నాణ్యమైన తాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. కేవలం నిర్ణీత సమయాల్లో కాకుండా 24 గంటలూ నీటిని అందుబాటులో ఉంచడమే ఈ ప్రాజెక్ట్ ఉద్దేశమని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన్ రావు, విజయ్ కుమార్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, టీడీపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఒంగోలులో మహనీయుల స్ఫూర్తి.. 20 విగ్రహాలను ఆవిష్కరించిన మంత్రి

సమాజానికి వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన మహనీయుల సేవలను స్మరించుకుంటూ, వారి ఆశయాలను భావితరాలకు అందించాలనే ఉన్నత లక్ష్యంతో ఒంగోలు నగరంలో భారీ కార్యక్రమం జరిగింది. నగరంలోని కిమ్స్ హాస్పిటల్ ఫ్లై ఓవర్ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన 20 మంది ప్రముఖుల విగ్రహాలను రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ శుక్రవారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మహనీయుల విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఇదే వేదికపై ప్రకాశం జిల్లా సంస్కృతి, పశుసంపదకు ప్రతీకగా నిలిచే ఒంగోలు గిత్త విగ్రహాన్ని కూడా ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ, మహనీయుల జీవితాలు, వారి సేవలు, స్ఫూర్తిదాయకమైన ఆలోచనలు నేటి యువతకు భావితరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు. రాజకీయ, సామాజిక, సాంస్కృతిక, విద్యా, సాహిత్య రంగాల్లో విశేష సేవలు అందించిన ప్రముఖుల విగ్రహాలను ఒకేచోట ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజలకు నిత్యం కనిపించేలా ప్రధాన కూడలిలో ఈ విగ్రహాలను ఏర్పాటు చేయడం ద్వారా ఆయా మహనీయుల సేవలు, త్యాగాలు, ఆశయాలు ప్రజలకు మరింత చేరువవుతాయని లోకేశ్ అభిప్రాయపడ్డారు. ఈ స్ఫూర్తిదాయక విగ్రహాలు ఒంగోలు నగరానికి మరో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని ఆయన తెలిపారు. ఒంగోలు గిత్త.. జిల్లాకే గర్వకారణం ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి గాంచిన ఒంగోలు జాతి పశువుల విశిష్టతను చాటిచెప్పేలా, జిల్లా సంస్కృతికి అద్దం పట్టేలా ఒంగోలు గిత్త విగ్రహాన్ని ఏర్పాటు చేయడంపై మంత్రి లోకేష్ హర్షం వ్యక్తం చేశారు. ఇది ప్రకాశం జిల్లా పశుసంపదకు, వారసత్వానికి ప్రతీకగా నిలుస్తుందని, దీని ప్రాముఖ్యతను భావితరాలకు పరిచయం చేస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు గొట్టిపాటి రవి కుమార్, డోలా బాల వీరాంజనేయ స్వామి, ఆనం రాంనారాయణ రెడ్డి, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన్ రావు, ఉగ్ర నరిసింహారెడ్డి, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

* **మంత్రి చేతుల మీదుగా ఆవిష్కరించిన విగ్రహాల వివరాలు:**

రాజకీయ, స్వాతంత్ర్య సమరయోధులు: రొండా నారపరెడ్డి (మాజీ మంత్రి, ఎంపీ), దర్శి చెంచయ్య (స్వాతంత్ర్య సమరయోధుడు), మాదాల నారాయణ స్వామి (మాజీ ఎంపీ, ఎమ్మెల్యే). సామాజిక సేవకులు, విద్యావేత్తలు, అధికారులు: కత్తి చంద్రయ్య (ప్రకాశం జిల్లా తొలి కలెక్టర్), వరదా శ్రీరాముల నాయుడు (ఒంగోలు తొలి పురపాలక సంఘ అధ్యక్షులు), బివియల్ నారాయణ ('పావలా డాక్టర్'), క్లౌ జాన్ ఎవరెట్ (సామాజిక సేవకులు), గోరంట్ల వెంకన్న (మహాదాత), శ్రీ భద్రిరాజు కృష్ణమూర్తి (ద్రావిడ భాషాశాస్త్ర పితామహులు), బండారు రామారావు (నాటక సమాజ నిర్వాహకులు). కళా, సాహిత్య రంగ ప్రముఖులు: భానుమతి రామకృష్ణ (బహుముఖ ప్రజ్ఞాశాలి, నటి), గరికపాటి వరలక్ష్మి (నటి, గాయని), టి. కృష్ణ (విప్లవ దర్శకులు), షేక్ చినమౌలానా (నాదస్వర విద్వాంసులు), నీలంరాజు వెంకట శేషయ్య (పాత్రికేయులు, సాహితీవేత్త), ధారా రామనాథ శాస్త్రి (నాట్యావధాని), నాగభైరవ కోటేశ్వరరావు (కవి, రచయిత), కలేకూరి ప్రసాద్ (దళిత కవి, రచయిత), పైడి తెరేష్ బాబు (దళిత సాహితీవేత్త, కళాకారులు), మల్లవరపు జాన్ (కవి, రచయిత).

### ఆర్మీ జవాన్లకు
## రాఖీలు కట్టిన కశ్మీరీ యువతులు..

(మొదటిపేజీ తరువాయి)
విద్యార్థినులు సరిహద్దుల్లో విధి నిర్వహణలో ఉన్న భారత సైనిక జవాన్లకు రాఖీలు కట్టి తమ ఆత్మీయతను చాటుకున్నారు. సొంత కుటుంబాలకు దూరంగా ఉంటూ దేశ సరిహద్దులను కాపాడుతున్న జవాన్లకు రాఖీలు కట్టి, వారికి మిఠాయిలు తినిపించారు. కశ్మీరీ సోదరీమణులు చూపించిన ఈ ఆత్మీయానురాగానికి సైనికులు తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. సరిహద్దుల్లో తమ రక్షణ కోసం రాత్రింబవళ్లు శ్రమిస్తున్న సైనికులకు కృతజ్ఞతగా కశ్మీరీ ఆడబిడ్డలు ఈ వేడుకను నిర్వహించగా... ప్రతిగా జవాన్లు కూడా వారికి ఎల్లవేళలా రక్షణగా ఉంటామని మాట ఇచ్చారు. దీనికి సంబంధించిన హృదయానికి హత్తుకునే వీడియో సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవ్వడమే కాకుండా, నెటిజన్ల మనసులను గెలుచుకుంటోంది.

## మంగళగిరిలో మోడరన్ రైతు బజార్.. శంకుస్థాపన చేసిన మంత్రి లోకేశ్

మంగళగిరిని దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ మరో కీలక ముందడుగు వేశారు. మంగళగిరి పట్టణంలోని నిడమర్రు రైల్వే గేట్ సమీపంలో రూ.18.55 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న అత్యాధునిక 'మోడరన్ రైతు బజార్' నిర్మాణ పనులకు ఆయన గురువారం భూమిపూజ చేసి, శంకుస్థాపన చేశారు. సుమారు 5.90 ఎకరాల విస్తీర్ణంలో ఈ ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను నిర్మించనున్నారు. అరబిందో ఫార్మా ఫౌండేషన్ తన కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధుల నుంచి ఈ ప్రాజెక్టుకు అవసరమైన ఆర్థిక సహకారాన్ని అందిస్తోంది. స్థానిక ప్రజలు, రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, ఈ రిటైల్, హోల్ సేల్ కూరగాయల మార్కెట్ నిర్మాణానికి మంత్రి లోకేశ్ శ్రీకారం చుట్టారు. మొత్తం 71,925 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఇందులో రిటైల్ మార్కెట్ విభాగంలో కూరగాయల విక్రయాల కోసం 102 స్టాళ్లు, పండ్లు, పూల కోసం 54 స్టాళ్లను కేటాయించారు. అలాగే, హోల్ సేల్ మార్కెట్ విభాగంలో 23 దుకాణాలు, 18 అన్‌లోడింగ్ ప్లాట్‌ఫామ్‌లను ఏర్పాటు చేయనున్నారు. వీటితో పాటు కోల్డ్ స్టోరేజీ, కూరగాయలు ప్రక్షాళన కేంద్రాలు, క్యాంటీన్, వాహనాల పార్కింగ్ వంటి అత్యాధునిక సదుపాయాలను ఇక్కడ కల్పించనున్నారు. శంకుస్థాపన కార్యక్రమం నిమిత్తం విచ్చేసిన మంత్రి లోకేశ్‌కు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన శిలాఫలకాన్ని ఆవిష్కరించి, మార్కెట్ నమూనాను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అరబిందో ఫార్మా ట్రస్ట్ ప్రతినిధులు, స్థానిక టీడీపీ ముఖ్య నాయకులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

### దీర్ఘకాలిక నొప్పికి..
## మెదడులోనే స్విచ్ఛాఫ్ బటన్

సంవత్సరాల తరబడి వేధించే దీర్ఘకాలిక నొప్పితో బాధపడేవారికి వైద్య శాస్త్రం కొత్త ఆశను చూపిస్తోంది. మెదడులో నొప్పికి కారణమయ్యే సంకేతాలను గుర్తించి, వాటిని విద్యుత్ ప్రేరణతో అడ్డుకోవడం ద్వారా తీవ్రమైన నొప్పిని నియంత్రించవచ్చని శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ప్రతి వ్యక్తి మెదడులోని నొప్పి వ్యవస్థను ప్రత్యేకంగా మ్యాపింగ్ చేసి, దానికి అనుగుణంగా చికిత్స అందించే ఈ నూతన విధానం వైద్య రంగంలో ఒక కీలక ముందడుగుగా భావిస్తున్నారు. ఈ పరిశోధన వివరాలు 'బ్రెయిన్ స్టిమ్యులేషన్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయానికి చెందిన న్యూరో సర్జన్ వివేక్ బుచ్ నేతృత్వంలోని బృందం ఈ పరిశోధనను చేపట్టింది. తీవ్రమైన ముఖ నొప్పితో (ట్రైజెమినల్ సంబంధిత నొప్పి) బాధపడుతున్న ముగ్గురు వ్యక్తులపై ఈ ప్రయోగాత్మక చికిత్సను పరీక్షించారు. ఇందులో భాగంగా, వారి మెదడులో తాత్కాలికంగా ఎలక్ట్రోడ్లను అమర్చారు. కొన్ని రోజుల పాటు మెదడులోని వేర్వేరు ప్రాంతాలలో విద్యుత్ ప్రేరణ ఇచ్చి, నొప్పికి సంబంధించిన నాడీ సంకేతాలు ఎక్కడ, ఎలా ఉత్పన్నమవుతున్నాయో మ్యాపింగ్ చేశారు. అనంతరం, ఆ నిర్దిష్ట ప్రాంతంలో లక్షిత విద్యుత్ తరంగాలను పంపి నొప్పి సంకేతాలకు 'బ్రేక్' వేశారు. సాధారణంగా గాయం కారణంగా వచ్చే నొప్పి (అక్యూట్ పెయిన్) గాయం నయమవ్వగానే తగ్గిపోతుంది. కానీ దీర్ఘకాలిక నొప్పి (క్రానిక్ పెయిన్) అలా కాదు. గాయం మానిపోయినా, మెదడు మరియు వెన్నుపాములో కలిగే మార్పుల వల్ల ఇది నెలల తరబడి, ఏళ్ల తరబడి కొనసాగుతుంది. దీనికి చికిత్సగా డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్ (DBS) పద్ధతి అందుబాటులో ఉన్నప్పటికీ, ఫలితాలు అంతంతమాత్రంగానే ఉంటున్నాయి. ఎందుకంటే, నొప్పికి సంబంధించిన నాడీ వ్యవస్థ ఒక్కో వ్యక్తిలో ఒక్కోలా ఉంటుంది. అయితే, ఈ కొత్త విధానంలో ప్రతి వ్యక్తి మెదడుకు ప్రత్యేకంగా మ్యాపింగ్ రూపొందించి చికిత్స అందించడం వల్ల సత్ఫలితాలు వస్తున్నాయని పరిశోధకులు తెలిపారు. ఈ అధ్యయనంలో పాల్గొన్న ముగ్గురిలో ఒకరికి పెద్దగా ఉపశమనం లభించలేదు. కానీ, మిగిలిన ఇద్దరు మాత్రం నొప్పి నుంచి గణనీయమైన ఉపశమనం పొందారు. వారిలో ఒకరైన 40 ఏళ్ల మహిళకు, పరీక్షల అనంతరం శాశ్వత ఇంప్లాంట్లు అమర్చారు. చికిత్స తర్వాత 6 నెలలకు, ఏడాదికి కూడా తన నొప్పి చాలా వరకు తగ్గిపోయిందని ఆమె పరిశోధకులకు నిరంతరం తెలియజేస్తున్నారు. ఫలితాల పట్ల సంతృప్తి చెందిన రెండో వ్యక్తి కూడా త్వరలోనే శాశ్వత ఇంప్లాంట్ చేయించుకోవాలని యోచిస్తున్నారు. ఇది చాలా తక్కువ మందిపై జరిపిన ప్రాథమిక దశ పరిశోధన మాత్రమేనని, దీనిని విస్తృత స్థాయిలో అందుబాటులోకి తీసుకురావడానికి మరిన్ని అధ్యయనాలు అవసరమని శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు. ఏదేమైనా, ఇప్పటివరకు చికిత్సకు లొంగని మొండి దీర్ఘకాలిక నొప్పి కేసులకు ఈ వ్యక్తిగతీకరించిన మ్యాపింగ్ విధానం ఒక సరికొత్త మార్గాన్ని చూపుతుందని నిపుణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## జీఎస్టీ 2.0: తెలంగాణ కుటుంబాలకు ఊరట.. తగ్గనున్న పన్ను భారం!

- **జీఎస్టీ 2.0తో తెలంగాణ కుటుంబాలపై పన్ను భారం తగ్గే అవకాశం**
- **ఆహార పదార్థాలపై పన్ను రేటు గణనీయంగా తగ్గుతుందని అంచనా**
- **ప్రస్తుతం 10.4 శాతంగా ఉన్న పన్ను భారం 7.1 శాతానికి పడిపోయే సూచనలు**




ప్రతిపాదిత జీఎస్టీ 2.0 విధానం అమల్లోకి వస్తే తెలంగాణలోని కుటుంబాలపై పన్ను భారం తగ్గే అవకాశం ఉందని సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్ (సీఈఎస్ఎస్) తన అధ్యయనంలో వెల్లడించింది. అయితే, ఈ విధానం ప్రజల వద్ద అదనపు నగదును మిగిల్చే కంటే, పెరుగుతున్న ద్రవ్యోల్బణం నుంచి వారికి పాక్షిక రక్షణ కల్పించేందుకే ఎక్కువగా దోహదపడుతుందని నివేదిక స్పష్టం చేసింది. సెస్ అంచనాల ప్రకారం, జీఎస్టీ 2.0 అమలైతే తెలంగాణ కుటుంబాలపై ప్రస్తుతం 5.4 శాతం నుంచి 10.4 శాతంగా ఉన్న పన్ను భారం, 3.9 శాతం నుంచి 7.1 శాతానికి తగ్గే అవకాశం ఉంది. ముఖ్యంగా ఆహార పదార్థాలపై పన్ను భారం గణనీయంగా తగ్గుతుందని ఈ అధ్యయనం పేర్కొంది. ఆహారం వస్తువులపై ప్రస్తుతం 2.2 శాతం నుంచి 7.4 శాతం వరకు ఉన్న పన్ను, కొత్త విధానంలో 0.9 శాతం నుంచి 3.4 శాతానికి పడిపోవచ్చని వివరించింది. అదేవిధంగా, ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలపై పన్ను సుమారు 13 శాతం నుంచి 45 శాతానికి దిగివస్తుందని నివేదిక అంచనా వేసింది. ఇప్పటికే ఆహార ధరలు సుమారు 17 శాతం మేర పెరిగిన నేపథ్యంలో, ఈ పన్ను తగ్గింపు సామాన్యులకు ఊరటనిచ్చే కీలక పరిణామంగా భావిస్తున్నారు. ఈ కొత్త విధానం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనకరంగా ఉంటుందని అధ్యయనం వివరించింది. గ్రామీణ ప్రాంతాల్లోని అత్యల్ప ఆదాయ వర్గాలపై పన్ను భారం 10.4 శాతం నుంచి 7.2 శాతానికి, పట్టణ ప్రాంతాల్లో 9.5 శాతం నుంచి 6.3 శాతానికి తగ్గుతుందని పేర్కొంది. మహిళలు నేతృత్వం వహించే కుటుంబాలపై కూడా పన్ను భారం తగ్గే అవకాశం ఉందని నివేదిక వెల్లడించింది.

## సంపాదకీయం

# 'క్యాష్‌లెస్' భ్రమలు
# క్లెయిమ్‌ల తిరస్కరణల వాస్తవాలు

రోగాలు పెరిగాయి, వైద్యశాస్త్రం కూడా ఎదిగింది. వైద్యశాస్త్రంలో వచ్చిన ఆవిష్కరణలను చూస్తే ఎవరికైనా ఆశ్చర్యం కలగక మానదు. మొదటిసారి మన జీవనాడిని నడిపించే గుండెను మార్చి మరొక గుండెను అమర్చే ప్రక్రియను కనిపెట్టినప్పుడు, ఇక జీవితానికి భరోసా వచ్చిందని అనుకున్నాం. తరువాత గుండెకే కాకుండా మెదడుకు కూడా కావలసినంత వైద్యం అందుబాటులోకి వచ్చింది. క్యాన్సర్ పేరు వింటేనే వణికిపోయే మానవాళికి ఊరటనిస్తూ చికిత్సలు అందుబాటులోకి వచ్చాయి. సర్జరీలు చేయడానికి మన శరీరంలోకి పంపించే కెమెరాను ఆవిష్కరించడానికి బీజం వేసిన శాస్త్రజ్ఞులను తలచుకుంటే, మనిషి సాధించిన విజ్ఞాన విజయాలకు గర్వంతో ఉప్పొంగిపోతాం. ఇన్ని అందుబాటులోకి వచ్చాయి కానీ, భారతదేశంలో నాణ్యమైన వైద్యం అందరికీ అందుబాటులోకి రాలేదు. హెల్త్ ఇన్సూరెన్స్ లేకపోతే ఇంత ఖరీదైన వైద్యం చేయించుకోవడం చాలా కష్టం. వైద్యం ఉందని తెలిసి కూడా చేయించుకోలేకపోవడం కంటే దురదృష్టం మరొకటి ఉండదు. ఇంతగా ఎదిగిపోయిన వైద్యం భారతదేశంలో అందరికీ అందుబాటులో ఉన్నదా అంటే 'లేదు' అనే స్పష్టంగా చెప్పవచ్చు. అభివృద్ధి చెందిన దేశాల మాదిరిగా వైద్యం అందించగల సత్తా మన ఆసుపత్రుల్లో ఉన్నప్పటికీ, ఆ సౌకర్యాన్ని పొందే స్తోమత మన దేశంలో పది శాతం మందికి కూడా లేదు. ఇక హెల్త్ ఇన్సూరెన్స్ చేయించుకునే వారి సంఖ్య చాలా తక్కువ. చేయించుకున్న వారి ఇక్కట్లు చూస్తే కొత్తగా ఇన్సూరెన్స్ తీసుకోవాలనుకునే వారు కూడా సందిగ్ధంలో పడతారు. ఇన్సూరెన్స్ చేయించడానికి శ్రద్ధ చూపే ఏజెంట్లు, వారి బతుకుతెరువు కోసం రోగం వస్తే బాగుండు అనుకునే రీతిలో తీపి కబుర్లు చెబుతారు. తీరా రోగం వచ్చాక కంపెనీ వారు పెట్టే కొర్రీలు చూసినప్పుడు రోగం తాలూకు బాధ పదింతలవుతుంది. ఇన్సూరెన్స్ చేయించేటప్పుడు ఏజెంట్ అడగని అనేక విషయాలను క్లెయిమ్ సమయంలో కంపెనీ ఆరా తీస్తుంది. ఇప్పుడు వచ్చిన రోగానికి ముందు ఎప్పుడైనా హాస్పిటల్‌కు వెళ్లి ఉంటే దాన్ని అడ్డం పెట్టుకుంటారు. గుండెనొప్పి వచ్చి హాస్పిటల్‌కు వెళ్లిన రోగిని—గతంలో ఎప్పుడైనా ఈ సమస్య వచ్చిందా అని డాక్టర్ అడిగినప్పుడు, "గతంలో టెస్టులు చేయించుకున్నాం, కానీ ఏమీ లేదని రిపోర్టులు వచ్చాయి" అని రోగి చెబితే, డాక్టర్ ఆ విషయాన్ని తన రిపోర్టులో నమోదు చేస్తారు. డాక్టర్ రిపోర్టులో ఎప్పుడైతే ఆ విషయం కనిపిస్తుందో, వెంటనే ఇన్సూరెన్స్ కంపెనీ వారు "పాలసీ తీసుకునేటప్పుడు ఈ విషయం చెప్పలేదు కాబట్టి క్లెయిమ్ ఇవ్వలేం" అని తేల్చేస్తారు. జీవితంలో ఎన్నోసార్లు హాస్పిటల్‌కు వెళతాం, ఎన్నో వైద్య పరీక్షలు చేయించుకుంటాం; అవన్నీ మనకు గుర్తు కూడా ఉండవు. డాక్టర్ పదేపదే అడిగినప్పుడు గుర్తుచేసుకుని, "అప్పుడు యాంజియోగ్రామ్ చేయించుకున్నాం, కానీ బ్లాక్స్ ఏమీ లేవన్నారు" అని చెబుతాం. అందులో ఎలాంటి రోగమూ బయటపడలేదనే వాస్తవాన్ని పక్కనపెట్టి, "యాంజియో చేయించుకున్న విషయాన్ని పాలసీ తీసుకునేటప్పుడు దాచారు కాబట్టి క్లెయిమ్‌ను ఆమోదించలేము" అని నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తారు. ఇన్సూరెన్స్ చేయించిన ఏజెంట్ ఇవన్నీ అడగడు; ఒకవేళ రోగి చెప్పినా, "అవి చెబితే ప్రీమియం పెరుగుతుంది" అని సలహా ఇచ్చి మరీ పక్కదారి పట్టించే అవకాశముంది. ఏజెంట్ చెప్పిన 'క్యాష్‌లెస్ వైద్యం' అనే ఆశతో ఆసుపత్రికి వచ్చే రోగి, కంపెనీ వారు పెట్టే అభ్యంతరాలకు హతాశుడవుతాడు. ఇప్పుడిప్పుడే దేశంలో ఆరోగ్య బీమా పట్ల ప్రజలు ఆసక్తి చూపిస్తున్నారు. కానీ ఉద్యోగరీత్యా కంపెనీలు ఇచ్చే గ్రూప్ ఇన్సూరెన్స్ మినహా, వ్యక్తిగతంగా పాలసీ తీసుకున్న మిగిలిన వారందరూ ఎదుర్కొంటున్న తీవ్ర సమస్య ఇది.అమెరికా వంటి దేశాల్లో ఇప్పటికీ ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థ పటిష్టంగా ఉంది. ముందుగా ఫ్యామిలీ డాక్టర్ సాధారణ పరీక్షలు చేసి, రోగి సమగ్ర ఆరోగ్య వివరాలను నమోదు చేసి ఇన్సూరెన్స్ కంపెనీకి రిఫర్ చేస్తారు. అందువలన అక్కడ ఇన్సూరెన్స్ కంపెనీలు రోగి క్లెయిమ్‌లను తిరస్కరించడం సాధారణంగా జరగదు. కానీ మన దేశంలో ఇన్సూరెన్స్ కంపెనీలు రోగికి ఏ రకంగా సేవలు అందించాలా అని కాకుండా, క్లెయిమ్‌ను ఎలా తిరస్కరించాలా అనే ఎక్కువ ఆలోచిస్తున్నాయి. ప్రైవేట్ ఆసుపత్రులు కార్పొరేట్ స్థాయిలో పరీక్షలు చేసేందుకు సంసిద్ధమవుతున్నాయి కానీ, ఇన్సూరెన్స్ కంపెనీలు మాత్రం భారతీయ రోగుల అవసరాలకు తగ్గట్లు సహకరించకపోగా తీవ్ర నిరాశకు గురిచేస్తున్నాయి.ఆ మధ్య ఒక ప్రముఖ ఆసుపత్రిలో జరిగిన సంఘటన అత్యంత హృదయవిదారకం. అరవై సంవత్సరాల గుండె జబ్బు బాధితుడిని కుటుంబసభ్యులు ఒక హాస్పిటల్‌లో చేర్పించారు. ఇన్సూరెన్స్ ఉంది కదా అనే ధైర్యంతో అడ్మిట్ చేశారు. తీరా యాంజియోప్లాస్టీ చేసే ముందు ఇన్సూరెన్స్ కంపెనీ ఏదో ఒక కొర్రీ పెట్టింది. సమయం వృథా చేస్తే రోగి ప్రాణానికే ప్రమాదమని డాక్టర్లు చెబుతున్నారే తప్ప, డబ్బులు చెల్లించకుండా వైద్యం చేసే ఉద్దేశం వారికి లేదు. రోగి కుటుంబసభ్యులకు ఒక్కసారిగా మూడు లక్షల రూపాయలు చెల్లించడం భారంగా మారింది. దిక్కుతోచక తెలిసిన వారందరికీ ఫోన్లు చేశారు. ఇన్సూరెన్స్ కంపెనీ వారిని బతిమాలారు, నిలదీశారు; కానీ ప్రయోజనం లేకపోయింది. ఈ లోపే జరగరాని నష్టం జరిగి ప్రాణం పోయింది. మన దేశంలో ఏదో ఒక పెద్ద హాస్పిటల్‌లో ఒక గంట కూర్చుంటే ఇటువంటి హృదయ విదారక దృశ్యాలు సర్వసాధారణంగా కనిపిస్తాయి. ఇందులో ఎవరిని తప్పపట్టాలో అర్థం కాదు. పాలసీలు చేయిస్తే తన కుటుంబాన్ని పోషించుకునేంత కమీషన్ వస్తుందని ఏజెంట్ అనుకుంటాడు. జేబులోంచి డబ్బులు తీసే పనిలేని ఉచిత వైద్యం అందుబాటులోకి వస్తుందని సామాన్యుడు భావిస్తాడు. ఏ వివరాలు చెప్పాలో సరిగ్గా తెలియక పాలసీదారుడు కొన్ని వదిలేస్తే, ఏజెంట్ సలహా మేరకు మరికొన్ని దాచిపెట్టడం జరుగుతుంది. అన్ని నిబంధనలకూ సరిగ్గా సరిపోయే క్లెయిమ్‌లు చాలా కొద్దిగానే ఉంటాయి. ఒకవేళ అంతా సక్రమంగా ఉన్నా కూడా ఏదో ఒక కొర్రీ పెట్టే ప్రయత్నమే జరుగుతోంది. ఇన్సూరెన్స్ నిర్వహణ కూడా ఒక అవగాహనతో కూడుకున్న వ్యవహారం. సాధారణంగా ఏజెంట్ల మొహమాటానికి పోయి చాలామంది పాలసీలు తీసుకుంటారు; కానీ వాటిని క్రమం తప్పకుండా రెన్యూవల్ చేసేవారు చాలా తక్కువ. ఇన్సూరెన్స్ కంపెనీల ఆదాయంలో ఎక్కువ భాగం ఇలా మధ్యలోనే ఆగిపోయిన పాలసీల నుంచే వస్తుంది. ఒక కంపెనీ నుంచి మరో కంపెనీకి మారుతూ ఉండటం, గడువు ముగిసి పాలసీలు ల్యాప్స్ అవ్వడం జరుగుతుంటుంది. ప్రీమియం క్రమం తప్పకుండా కట్టినా ఆపత్కాలంలో డబ్బులు వస్తాయన్న నమ్మకం లేకపోవడమే నేడు ప్రజలను ఆరోగ్య బీమాకు దూరం చేస్తోంది. 'ఆయుష్మాన్ భారత్' వంటి పథకాలు రూపొందించడంలో ప్రభుత్వాలకు సదుద్దేశం ఉన్నప్పటికీ, మన ప్రభుత్వ ఆసుపత్రులలో తగినన్ని అత్యాధునిక సౌకర్యాలు లేవు. ఇన్సూరెన్స్ కంపెనీలు పారదర్శకతను పాటించకపోవడం, ఆరోగ్య బీమాను కేవలం వ్యాపార దృక్పథంతో మాత్రమే చూడటం వల్లనే ఇటువంటి దుస్థితి తలెత్తుతోంది. వ్యాపారంతో పాటు కనీస మానవతా దృక్పథం కూడా ఉండాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) సూచిస్తున్నప్పటికీ, బీమా సంస్థలు ఆ దిశగా దృష్టి సారించడం లేదు.!

- ఇంద్రాణి

## చరిత్రలో ఈ రోజు
### ఆగస్టు 29

AUGUST 29

* తెలుగు భాషా దినోత్సవము
* జాతీయ క్రీడా దినోత్సవం
* అంతర్జాతీయ అణుపరీక్షల వ్యతిరేక దినోత్సవం
* 1604 : మొఘల్ చక్రవర్తి హుమాయూన్ భార్యలలో ఒకరు, చక్రవర్తి అక్బర్ తల్లి హమీదా బాను బేగం మరణం (జ.1527).
* 1863 : తెలుగులో వాడుక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామమూర్తి జననం (మ.1940). (చిత్రంలో)
* 1905 : భారత క్రీడా మాంత్రికుడు మేజర్ ధ్యాన్ చంద్ జననం (మ.1979).(చిత్రంలో)
* 1923 : భారత మాజీ క్రికెట్ క్రీడాకారుడు హీరాలాల్ గైక్వాడ్ జననం (మ.2003).
* 1928 : పాతతరం తెలుగు చలనచిత్ర నటి, నేపథ్యగాయని రావు బాలసరస్వతీ దేవి జననం.
* 1958 : అమెరికాకు చెందిన


గిడుగు రామమూర్తి

ప్రముఖ సంగీత కళాకారుడు మైకల్ జాక్సన్ జననం (మ.2009).
* 1976 : బెంగాలీ కవి, సంగీతకారుడు, విప్లవకారుడు ఖాజీ నజ్రుల్ ఇస్లాం మరణం (జ.1899).
* 2018 : తెలుగు దేశం పొలిట్ బ్యూరో సభ్యుడు, నటుడు, నిర్మాత, తెలుగుదేశం చైతన్య రథసారథి నందమూరి హరికృష్ణ మరణం (జ.1956 ).

## ఆసుపత్రిలో చేరిన
# వైకాపా నేత అంబటి రాంబాబు

హైదరాబాద్: వైకాపా నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రిలో చేరారు. పరీక్షలు చేసిన వైద్యులు ఆయనకు యాంజియోప్లాస్టీ చేసి స్టెంట్ వేశారు. ప్రస్తుతం అంబటి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.



## రిటైర్డ్ తహసీల్దార్ నుంచి లంచం తీసుకుంటూ
# చిక్కిన సీనియర్ అకౌంటెంట్



నర్సీపట్నం: రిటైర్డ్ తహసీల్దార్ నుంచి లంచం తీసుకుంటూ ఓ అధికారి అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కారు. ఈ సంఘటన అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో చోటుచేసుకుంది. ఇంక్రిమెంట్ బకాయిల బిల్లులు మంజూరు చేసేందుకు సీనియర్ అకౌంటెంట్ లంచం డిమాండ్ చేశారు. దీంతో రూ.30 వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు.




## వెలిగొండ నిర్వాసితులకు వైకాపా ప్రభుత్వం
# ఒక్కరూపాయీ ఇవ్వలేదు: మంత్రి నిమ్మల

మార్కాపురం: వెలిగొండ నిర్వాసితులు ప్రభుత్వం కేటాయించిన భూముల్లో ఇళ్లు నిర్మించుకుని గృహప్రవేశాలు చేసేవరకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు హామీ ఇచ్చారు. శుక్రవారం మార్కాపురం కలెక్టరేట్‌లో విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో నిర్వాసితులకు ఇచ్చిన పరిహారం శూన్యం అని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అవార్డులో లేని వారికి సైతం పరిహారం ఇవ్వడానికి సిద్ధమైనట్లు తెలిపారు. ఇందుకోసం వచ్చిన 1800 దరఖాస్తులను పరిశీలించి అదనంగా రూ.169 కోట్లు చెల్లించేందుకు సీఎం చంద్రబాబు అంగీకరించారన్నారు. అలాగే నిర్వాసిత గ్రామాల్లోని పశువులకు నెలరోజులపాటు ఉచితంగా దాణా, ప్రజలకు నిత్యావసరాలు అందిస్తామని పేర్కొన్నారు. 2019 నుంచి 2026 ఆగస్టు 31 తేదీ వరకు 18 ఏళ్లు నిండిన యువతీ యువకులకు రూ.2 లక్షలు చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. వెలిగొండ నిర్వాసితులకు సంబంధించి రూ.900 కోట్లు ఇవ్వాల్సి ఉండగా వైకాపా ప్రభుత్వ హయాంలో ఒక్కరూపాయి కూడా ఇవ్వలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 40 రోజుల్లో మూడు విడతలుగా రూ.318 కోట్లు, రూ.200 కోట్లు, రూ.250 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. పనులు పూర్తికాకుండానే వెలిగొండను అప్పటి సీఎం జగన్ జాతికి అంకితం చేశారన్నారు. తాము అధికారంలోకి వచ్చే నాటికి వెలిగొండ పనులు పూర్తి కాలేదన్నారు. వైకాపా హయాంలో ఫీడర్ కెనాల్‌కు రంధ్రాలు ఏర్పడ్డాయని, దానికి సంబంధించి 11 కి.మీ లైనింగ్ పూర్తి చేశామని తెలిపారు. రెండేళ్లలోనే వెలిగొండ పనులు చకాచకా పూర్తి చేసినట్లు తెలిపారు.

# ఇంటింటికీ టీడీపీ: 90 లక్షల ఇళ్ల మైలురాయిని దాటిన కార్యక్రమం

- **33వ రోజూ విజయవంతంగా కొనసాగిన 'ఇంటింటికీ తెలుగుదేశం'**
- **ఇప్పటివరకు మొత్తం 90.55 లక్షల కుటుంబాలను సందర్శించిన శ్రేణులు**
- **ప్రభుత్వ పథకాలపై ప్రజలకు వివరిస్తూ, వారి సమస్యల సేకరణ**
- **కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్న టీడీపీ**

తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'ఇంటింటికీ తెలుగుదేశం - 2 ఏళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమం మరో కీలక మైలురాయిని అధిగమించింది. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శ్రేణులు ఇప్పటివరకు 90 లక్షలకు పైగా కుటుంబాలను సందర్శించి, ప్రభుత్వ పనితీరుపై ఫీడ్‌బ్యాక్ సేకరించాయి. శుక్రవారంతో ఈ కార్యక్రమం 33వ రోజుకు చేరుకుంది. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించే లక్ష్యంతో




ఈ కార్యక్రమాన్ని టీడీపీ నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా శుక్రవారం ఒక్కరోజే పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి రాష్ట్రవ్యాప్తంగా 2,07,428 ఇళ్లను సందర్శించారు. దీంతో కార్యక్రమం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు సందర్శించిన మొత్తం ఇళ్ల సంఖ్య 90.55 లక్షలకు చేరినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఈ కార్యక్రమంలో భాగంగా టీడీపీ శ్రేణులు ప్రతి గడపకూ వెళ్లి, ప్రతి కుటుంబాన్ని ప్రత్యక్షంగా కలుస్తున్నాయి. రైతులు, మహిళలు, యువత, పేదలు, మధ్యతరగతి వర్గాలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తున్నారు. అదే సమయంలో, ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుంటూ, వారి అభిప్రాయాలను నేరుగా నమోదు చేసుకుంటున్నారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుండటంతో ఈ కార్యక్రమం మరింత ఉత్సాహంగా కొనసాగుతోందని టీడీపీ నేతలు చెబుతున్నారు. పార్టీ శ్రేణులతో పాటు ప్రజలు కూడా ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భాగస్వాములవుతున్నట్లు వారు పేర్కొన్నారు.

## ఎన్టీఏ డైరెక్టర్‌గా ఏపీ కేడర్ ఐఏఎస్ వి.ప్రసన్న వెంకటేశ్

అమరావతి: ఏపీ కేడర్‌కు చెందిన వి.ప్రసన్న వెంకటేశ్ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ)కి డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఈమేరకు కేంద్ర సిబ్బంది వ్యవహారాల మంత్రిత్వ శాఖ (డీఓపీటీ) ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ కేడర్ 2012 బ్యాచ్ ఐఏఎస్ అధికారిగా



పనిచేసిన ప్రసన్న వెంకటేశ్ సెంట్రల్ స్టాఫింగ్ స్కీమ్ కింద ఐదేళ్లపాటు ఎన్టీఏ డైరెక్టర్‌గా కొనసాగనున్నారు. గతంలో ఆయన ఏలూరు కలెక్టర్‌గా, విజయవాడ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేశారు. ప్రసన్న వెంకటేశ్ స్వస్థలం తమిళనాడు రాష్ట్రంలోని తిరిచీ.





## సీఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసిన నాగబాబు

- **ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఎమ్మెల్సీ నాగబాబు భేటీ**
- **ఏపీ గ్రీన్ కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతల స్వీకరణ**
- **నాగబాబుకు క్యాబినెట్ హోదా కల్పించిన ప్రభుత్వం**
- **2047 నాటికి రాష్ట్రంలో 50 శాతం పచ్చదనం పెంచడమే లక్ష్యం**

జనసేన ఎమ్మెల్సీ, మెగా బ్రదర్ కొణిదెల నాగబాబు ముఖ్యమంత్రి చంద్రబాబుతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్‌గా శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం, ఆయన సతీసమేతంగా ఉండవల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయానికి వెళ్లి చంద్రబాబును కలిశారు. ఈ సందర్భంగా నాగబాబు దంపతులను సీఎం చంద్రబాబు సత్కరించి, నూతన బాధ్యతలకుగాను శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు, మంగళగిరిలోని అరణ్య భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాగబాబు ఏపీ గ్రీన్ సొసైటీ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఆయన తన అర్ధాంగి పద్మజతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి పదవిని అలంకరించారు. ఈ పదవికి ప్రభుత్వం ఆయనకు క్యాబినెట్ హోదా కల్పించింది. 2047 నాటికి రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో 50 శాతం అడవులు, చెట్లను పెంచాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఏపీ గ్రీన్ కార్యక్రమంలో భాగంగా నాగబాబుకు ఈ కీలక బాధ్యతలు అప్పగించారు. బాధ్యతలు స్వీకరించిన నాగబాబుకు పీసీసీఎఫ్ పి.వి. చలపతి రావు, అదనపు పీసీసీఎఫ్ రాహుల్ పాండే సహా పలువురు అటవీ శాఖ ఉన్నతాధికారులు, ఇతర ప్రముఖులు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

## స్వార్థం, అధికార దాహం కోసం ఎవరినైనా బలిచేసే వ్యక్తి జగన్: పార్థసారథి

- **అధికారులు, పారిశ్రామికవేత్తలను జైలుపాలు చేసిన చరిత్ర జగన్ ది అన్న పార్థసారథి**
- **జగన్ కారణంగా ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మికి జైలు జీవితం తప్పలేదని వ్యాఖ్య**
- **శ్రీనివాసన్ వంటి పారిశ్రామికవేత్తలను కూడా వివాదాల్లోకి లాగేశారని విమర్శ**

వైసీపీ అధినేత జగన్ పై మంత్రి కొలుసు పార్థసారథి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. జగన్ తన స్వార్థం, అధికార దాహం కోసం ఎవరినైనా బలి చేయడానికి వెనుకాడరని... అధికారులు, పారిశ్రామికవేత్తలను జైలుపాలు చేసిన ఘోరమైన చరిత్ర ఆయనదని మండిపడ్డారు. తన రాజకీయ ప్రయోజనాల కోసం అమాయక అధికారుల జీవితాలతో జగన్ ఆడుకున్నారని ఆరోపించారు. గతంలో ఓబుళాపురం మైనింగ్ కేసులో జగన్ అక్రమ వ్యవహారాల వల్ల మహిళా ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మికి జైలు జీవితం తప్పలేదని ఈ సందర్భంగా మంత్రి గుర్తుచేశారు. అధికారాన్ని వాడుకుని ఎంతటివారితోనైనా అనైతిక పనులు చేయించగల నైజం మాజీ సీఎంది అని మంత్రి ధ్వజమెత్తారు. సొంత రాజకీయ లబ్ధి కోసం అమాయకులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన తీరుకు నటి జత్వానీ ఉదంతమే ప్రత్యక్ష సాక్ష్యమని తెలిపారు. వైసీపీ హయాంలో ఏపీపీఎస్సీ పరీక్షల్లో ఊహించని రీతిలో భారీ అక్రమాలు, అవకతవకలు జరిగాయని ఆరోపించారు. సీనియర్ ఐపీఎస్



అధికారి సీతారామాంజనేయులు హయాంలో అడుగడుగునా నిబంధనలు ఉల్లంఘించి వ్యవస్థలను దిగజార్చారని, జగన్ కనుసన్నల్లోనే అధికారులను పావులుగా వాడుకుని ఏపీపీఎస్సీలో కుంభకోణానికి పాల్పడ్డారని అన్నారు. విశాల్ గున్ని, కాంతి రాణా వంటి పోలీసు అధికారులను తన స్వార్థానికి వాడుకుని వారిని బలిపశువులను చేశారని విమర్శించారు. జగన్ రెడ్డి దోపిడీ రాజకీయాలకు లోబడి పనిచేసిన పలువురు అధికారులు, నాయకులు తమ కెరీర్‌లను నాశనం చేసుకున్నారని మంత్రి పార్థసారథి వ్యాఖ్యానించారు. ఇండియా సిమెంట్స్ అధినేత ఎన్.శ్రీనివాసన్ వంటి ప్రముఖ పారిశ్రామికవేత్తలను కూడా వివాదాల్లోకి లాగి చిక్కుల్లో పడేశారని, వైసీపీ దోపిడీకి సహకరించి మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు జైలు జీవితాన్ని అనుభవించాల్సి వచ్చిందని గుర్తుచేశారు. జగన్ మాట విని తప్పుడు పనులు చేసిన అధికారులు, నాయకులు చివరకు తీవ్ర విమర్శలు, అవమానాల పాలయ్యారని తెలిపారు. వ్యవస్థలను నిర్వీర్యం చేసి అనేక మంది జీవితాలను నాశనం చేసిన జగన్ వైఖరిని ప్రజలంతా గమనించాలని చెప్పారు.

## కాలుష్యం బారి నుంచి కాపాడండి.. కృష్ణంపాలెం గ్రామస్థుల విజ్ఞప్తిపై స్పందించిన పవన్

అమరావతి: కాలుష్యం బారి నుంచి తమను కాపాడాలంటూ అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం కృష్ణంపాలెం గ్రామస్థులు చేసిన విజ్ఞప్తిపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పందించారు. బాలాజీ యాక్షన్ బిల్డ్ వెల్ సంస్థ కార్యకలాపాల వల్ల ఇబ్బందిపడుతున్నామని కృష్ణంపాలెం ప్రజలు సామాజిక మాధ్యమాల ద్వారా పవన్ దృష్టికి తెచ్చారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు.. కాలుష్య నియంత్రణ మండలి అధికారులు బాలాజీ



యాక్షన్ బిల్డ్ వెల్ సంస్థలో తనిఖీలు చేపట్టాలని పవన్ ఆదేశించారు. అక్కడకు వెళ్లిన అధికారులు.. పరిశ్రమలో యంత్ర పరికరాల ట్రయల్ రన్‌లో కలప వ్యర్థాలను ఇంధనంగా ఉపయోగించడం వల్ల బాయిలర్ నుంచి వెలువడుతున్న కాలుష్య వాయువులు అత్యవసర ద్వారం నుంచి గ్రామాల వైపు వ్యాపిస్తున్నట్టు గుర్తించారు. నిబంధనల ప్రకారం మల్టీ సైక్లోన్ డస్ట్ కలెక్టర్ అనే వాయు కాలుష్య నియంత్రణ పరికరాన్ని బాయిలర్ పొగ గొట్టానికి అనుసంధానించి, శుద్ధి చేసిన ఉద్గారాలను తగిన ఎత్తు కలిగిన చిమ్నీ ద్వారా విడుదల చేయాల్సి ఉంది. యంత్రాల ప్రీ కమిషనింగ్ ప్రక్రియలో బాలాజీ యాక్షన్ బిల్డ్ వెల్ సంస్థ ఈ నిబంధనను పాటించడం లేదని గుర్తించారు. కాలుష్య నియంత్రణ పరికరాలు అమర్చిన అనంతరం కార్యకలాపాలు కొనసాగించుకోవాలని సదరు సంస్థ యాజమాన్యానికి పీసీబీ అధికారులు సూచించారు. చిమ్నీ ఏర్పాటు పనులు పూర్తి చేసేందుకు సదరు సంస్థ 20 రోజుల గడువు కోరగా, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టిన తర్వాతే కమిషనింగ్ ప్రక్రియ ప్రారంభించేందుకు అనుమతి ఇచ్చారు.

## మూడేళ్ల కొడుకును బ్రిడ్జిపైనే వదిలి.. గోదావరిలో దూకేసిన దంపతులు

- **గోదావరి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన దంపతులు**
- **వంతెనపై మూడేళ్ల కుమారుడిని ఒంటరిగా వదిలేసిన వైనం**
- **భీమవరానికి చెందిన దొడ్డ సాయి, శిరీషగా గుర్తింపు**
- **బాలుడిని సంరక్షణలోకి తీసుకుని, గాలింపు చేపట్టిన పోలీసులు**
- **ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న అధికారులు**

కన్నప్రేమను కాదనుకుని ఓ జంట తీసుకున్న కఠిన నిర్ణయం తీవ్ర విషాదాన్ని నింపింది. తమ మూడేళ్ల కుమారుడిని గోదావరి నది బ్రిడ్జిపై ఒంటరిగా వదిలేసి, దంపతులు నదిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ హృదయ విదారక ఘటన పశ్చిమ గోదావరి జిల్లాలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే, భీమవరానికి చెందిన దొడ్డ సాయి (29), దొడ్డ శిరీష (28) దంపతులు గురువారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో తమ మూడేళ్ల కుమారుడితో కలిసి స్కూటర్‌పై గోదావరి నదిపై ఉన్న వంతెన వద్దకు చేరుకున్నారు. అనంతరం, కన్నకొడుకును అక్కడే వదిలేసి, ఇద్దరూ నదిలోకి దూకేశారు. వంతెనపై పసిబాలుడు ఒంటరిగా ఏడుస్తుండటాన్ని గమనించిన అటుగా వెళుతున్న ప్రయాణికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, బాలుడిని సురక్షితంగా తమ సంరక్షణలోకి తీసుకున్నారు. దంపతులు వదిలివెళ్లిన స్కూటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. వెంటనే స్థానిక ఈతగాళ్లు, సహాయక సిబ్బంది సహకారంతో గోదావరి నదిలో గాలింపు చర్యలు ప్రారంభించారు. దంపతుల ఆచూకీ కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. అయితే, వారు ఈ దారుణ నిర్ణయం తీసుకోవడానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. పోలీసులు కేసు నమోదు చేసి, వారి కుటుంబ సభ్యులు, బంధువులు, ఇరుగుపొరుగు వారిని విచారించి వివరాలు సేకరిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగానే వారు బలవన్మరణానికి పాల్పడినట్టు



భావిస్తున్నారు. దొడ్డ సాయి ఓ ప్రైవేటు ఆసుపత్రి అంబులెన్స్ డ్రైవర్ గా పనిచేస్తున్నట్టు తెలుస్తోంది. ఇటీవల రాజమహేంద్రవరం సమీపంలో పంచాయతీ రాజ్ ఇంజినీర్ కుటుంబం గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రాష్ట్రంలో సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. అయితే, ఆ ఘటనకు, ప్రస్తుత ఉదంతానికి ఎటువంటి సంబంధం లేదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. దర్యాప్తు పూర్తయితే గానీ ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

## 25 రోజుల ఉత్కంఠకు తెర.. సురక్షితంగా ఇళ్లకు చేరిన ఏపీ మత్స్యకారులు

- **సముద్రంలో గల్లంతైన ఏడుగురు ఏపీ మత్స్యకారులు సేఫ్**
- **25 రోజుల తర్వాత కుటుంబసభ్యులను కలుసుకోవడంతో ఆనందోత్సాహాలు**
- **బోటు ఇంజన్ మొరాయించడంతో కడలిలో చిక్కుకుపోయిన జాలర్లు**
- **పశ్చిమ బెంగాల్ తీరంలో వీరిని గుర్తించిన స్థానిక మత్స్యకారులు**
- **కోస్ట్ గార్డ్, నేవీ ఆధ్వర్యంలో జరిగిన భారీ గాలింపు చర్యలు**

దాదాపు 25 రోజుల ఉత్కంఠకు తెరపడింది. ఈ నెల ప్రారంభంలో సముద్రంలో గల్లంతైన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఏడుగురు మత్స్యకారులు ఇవాళ సురక్షితంగా తమ ఇళ్లకు చేరుకున్నారు. డాక్టర్



బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన ఈ మత్స్యకారుల రాకతో వారి కుటుంబాల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. పశ్చిమ బెంగాల్ తీరంలో క్షేమంగా ఉన్నట్లు తేలడంతో అధికారులు వారిని కాకినాడకు తీసుకువచ్చారు. ఇక్కడ ఎమ్మెల్యే వి. కొండబాబు, ఎమ్మెల్సీ రాజశేఖర్, జిల్లా అధికారులు వారికి సాదరంగా స్వాగతం పలికారు. వివరాల్లోకి వెళితే.. కోనసీమ జిల్లా ఓడలరేవు ఫిష్ ల్యాండింగ్ పాయింట్ నుంచి ఆగస్టు 3న ఏడుగురు మత్స్యకారులు మెకనైజ్డ్ బోటులో వేటకు బయలుదేరారు. టూనా చేపల కోసం ఆంధ్ర తీరానికి దూరంగా సముద్రంలోకి వెళ్లిన వీరు, ఆగస్టు 7 నుంచి కుటుంబసభ్యులతో సంబంధాలు కోల్పోయారు. వాస్తవానికి ఆగస్టు 12న తిరిగి రావాల్సి ఉండగా, ఎంతకీ రాకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబసభ్యులు అధికారులను ఆశ్రయించారు. దీంతో రంగంలోకి దిగిన ప్రభుత్వం, బంగాళాఖాతంలో భారీ గాలింపు చర్యలు చేపట్టింది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఇండియన్ కోస్ట్ గార్డ్ (ఐసీజీ), నేవీ, ఇతర శాఖల సమన్వయంతో గాలింపును ముమ్మరం చేశారు. ఈ ఆపరేషన్‌లో 15 కోస్ట్ గార్డ్ నౌకలు, నాలుగు హెలికాప్టర్లు పాల్గొన్నాయి. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం పశ్చిమ బెంగాల్ తీరానికి సమీపంలోని శంఖర్‌పూర్ ఫిషింగ్ హార్బర్ వద్ద స్థానిక మత్స్యకారులు గల్లంతైన జాలర్ల బోటును గుర్తించారు. స్థానిక జాలర్లు తమ సెల్‌ఫోన్‌ను ఇవ్వడంతో, ఏపీలోని తమ కుటుంబసభ్యులతో మాట్లాడి తాము క్షేమంగా ఉన్నట్లు సమాచారం అందించారు. బోటు ఇంజన్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో సముద్రంలో చిక్కుకుపోయామని బాధితులు తెలిపారు. బెంగాల్ తీరానికి చేరడానికి ముందు మూడు రోజులకు పైగా ఆహారం లేకుండా తీవ్ర ఇబ్బందులు పడ్డామని వారు తమ ఆవేదనను వెలిబుచ్చారు. గల్లంతైన వారిలో కోపనాతి రామకృష్ణ, కొల్లాటి ఏసుదాసు, పాలెపు శాంతారావు, కొల్లాటి శ్రీనుబాబు, కర్రి రాంబాబు, సంగని తాతారావు, కటాది సతీష్ కుమార్ ఉన్నారు. వారు ప్రాణాలతో తిరిగి రావడంతో వారి గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది.

## బ్యాగులో బంగారం, నగదు, ఆస్తిపత్రాలు.. తిరుమలలో పోగొట్టుకున్న బ్యాగు భక్తులకు తిరిగి అప్పగింత

శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తుల పట్ల టీటీడీ సిబ్బంది మరోసారి తమ నిజాయతీని, సేవాభావాన్ని చాటుకున్నారు. తిరుమల ఘాట్ రోడ్డులో గుంటూరుకు చెందిన ఓ కుటుంబం పోగొట్టుకున్న లక్షల రూపాయల విలువైన నగలు, నగదు ఉన్న బ్యాగును భద్రంగా వారికి అప్పగించి ప్రశంసలు అందుకున్నారు. మానవత్వం, బాధ్యత కలగలిసి ఓ భక్తుల కుటుంబంలో ఆనందం నింపిన ఈ ఘటన తిరుమలలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గుంటూరు జిల్లా బ్రాడీపేటకు చెందిన పోతుల నారాయణ, సునీత దంపతులు తమ కుటుంబంతో కలిసి తిరుమల శ్రీవారి దర్శనానికి వస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం తిరుపతి నుంచి తిరుమల వచ్చే రెండో ఘాట్ రోడ్డులో ప్రయాణిస్తుండగా, తమ బ్యాగును ఎక్కడో జారవిడుచుకున్నారు. ఆ బ్యాగులో 61 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.2,02,840 నగదుతో పాటు సుమారు రూ.10 లక్షల విలువైన భూమి ఒప్పంద పత్రాలు ఉన్నాయి. ఉదయం సుమారు 6 గంటల సమయంలో ఘాట్ రోడ్డుపై వెళుతున్న ఓ బైకర్ ఆ బ్యాగును గమనించారు. వెంటనే దాన్ని తీసుకుని, ఉదయం 6:30 గంటలకు జీఎన్సీ టోల్‌గేట్ వద్ద విధుల్లో ఉన్న హోంగార్డు రెడ్డప్పరావుకు అప్పగించారు. సమాచారం అందుకున్న టీటీడీ భద్రతా సిబ్బంది ఆ బ్యాగును కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు తరలించి భద్రపరిచారు. మరోవైపు, బ్యాగ్ పోయిందని గుర్తించిన భక్తుల కుటుంబం ఆందోళనతో వెతుకుతూ టీటీడీ అధికారులను సంప్రదించింది. వారు చెప్పిన వివరాలు, అందించిన గుర్తింపు ఆధారాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం టీటీడీ సీవీఎస్వో మురళీకృష్ణ ఆదేశాల మేరకు, ఏవీఎస్వోలు కృష్ణయ్య, వెంకట శివకుమార్‌ల సమక్షంలో బ్యాగును తెరిపించి, అందులోని వస్తువులను యజమానులతో సరిచూయించారు.

# జగద్గిరిగుట్టలో ట్రాఫిక్ పోలీసుగా మారి.. ట్రాఫిక్‌ను క్లియర్ చేసిన కండక్టర్

- **రాఖీ పౌర్ణమి రద్దీలో ట్రాఫిక్ పోలీసుగా మారిన కండక్టర్**
- **మేడ్చల్ జిల్లా జగద్గిరిగుట్ట జంక్షన్‌లో ఘటన**
- **భారీగా నిలిచిపోయిన వాహనాలతో ఇబ్బందులు**
- **బస్సు దిగి స్వయంగా ట్రాఫిక్‌ను నియంత్రించిన ఉద్యోగి**

విధి నిర్వహణలో నిబద్ధతతో పాటు సామాజిక బాధ్యతను ప్రదర్శిస్తే ప్రజల నుంచి విశేషమైన ప్రశంసలు లభిస్తాయి. సరిగ్గా ఇదే రీతిలో ఒక ఆర్టీసీ కండక్టర్ చేసిన కృషి ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. రాఖీ పౌర్ణమి వేళ ఏర్పడిన భారీ ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు ఆయన స్వయంగా రంగంలోకి దిగి ట్రాఫిక్ పోలీసుగా బాధ్యతలు నిర్వహించారు. మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ పరిధిలోని జగద్గిరిగుట్ట ఔట్‌పోస్ట్ జంక్షన్‌లో శుక్రవారం రాఖీ పండుగ దృష్ట్యా వాహనాల రద్దీ విపరీతంగా పెరిగింది. పండుగ పూట తమ స్వస్థలాలకు వెళ్లే ప్రయాణికులతో ఆ ప్రాంతంలో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో వాహనదారులు, సామాన్య ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సరిగ్గా అదే సమయంలో అటుగా వెళుతున్న ఆర్టీసీ బస్సులోని కండక్టర్ ఈ పరిస్థితిని గమనించారు. పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకున్న ఆయన వెంటనే బస్సు దిగి రోడ్డుపైకి వచ్చి, స్వయంగా ట్రాఫిక్‌ను నియంత్రించడం ప్రారంభించారు. ఆయన చూపిన చొరవతో కొద్దిసేపటికే ట్రాఫిక్ సమస్య సద్దుమణిగి, వాహనాల రాకపోకలు సజావుగా సాగాయి. ఓ పౌరుడు ఈ దృశ్యాలను తన కెమెరాలో బంధించి సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా, ఆ వీడియో క్షణాల్లో వైరల్ అయింది. సదరు కండక్టర్ బాధ్యతాయుత ప్రవర్తనపై నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

## అసెంబ్లీ సమావేశాలకు సిద్ధమవుతున్న తెలంగాణ ప్రభుత్వం




హైదరాబాద్: అసెంబ్లీ సమావేశాలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం అవుతోంది. వచ్చే నెల మొదటి వారంలో శాసనసభ సమావేశాలు ఉండే అవకాశం ఉంది. వర్షాకాల అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ప్రజా ప్రాముఖ్యత కలిగిన అంశాలపై ప్రశ్నలు ఇవ్వాలని ఎమ్మెల్యేలకు శాసనసభ కార్యదర్శి సూచించారు. సెప్టెంబర్ 2లోపు ఇవి అందించాలన్నారు. రూల్ 39 ప్రకారం సభ్యులు అడిగే ప్రశ్నలకు సభలో మంత్రులు సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది. ముందస్తు ప్రశ్నలను సంబంధిత శాఖలకు పంపించి ప్రభుత్వం సమాధానాలు సిద్ధం చేయనుంది. స్పీకర్ ఆదేశాల మేరకు శాసన సభ్యులకు కార్యదర్శి రేండ్ల తిరుపతి లేఖ రాశారు.

## అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు : మంత్రి పొంగులేటి



హైదరాబాద్: క్యూర్ పరిధిలోని ఇందిరమ్మ ఇళ్లలో ఫ్లాట్లను లాటరీ ద్వారా లబ్ధిదారులకు కేటాయిస్తున్నారు. మొదటి దఫాలో 7,350 ఇందిరమ్మ ఇళ్లను అర్హులకు అందించనున్న ప్రభుత్వం కుత్బుల్లాపూర్, కంటోన్మెంట్, రాజేంద్రనగర్, నాంపల్లి నియోజకవర్గాల్లో లక్కీ డ్రా నిర్వహించింది. శుక్రవారం నాంపల్లి నియోజకవర్గంలోని లక్కీడ్రాలో పాల్గొన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి.. అర్హులైన పేదలందరికీ నిష్పక్షపాతంగా ఇళ్లు ఇస్తున్నామని తెలిపారు. పేదల ఆత్మగౌరవానికి చిహ్నంగా రూ. వందల కోట్లు ధర పలికే భూముల్లోనూ ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. మొదటివిడతలో కులం, మతం, పార్టీ చూడకుండా అర్హులందరికీ ఇళ్లు ఇచ్చామని, మరో 10 రోజుల్లో రెండో విడత జాబితా విడుదల చేస్తామన్నారు. 16 నియోజకవర్గాల్లో స్థలాలు సేకరించి టెండర్లు పూర్తిచేశామన్నారు. రెండు, మూడు రోజుల్లో టవర్ల నిర్మాణం ప్రారంభిస్తామని మంత్రి తెలిపారు. ఇళ్ల రిజిస్ట్రేషన్‌కు ఎలాంటి ఛార్జీలు వసూలు చేయట్లేదన్నారు. పదేళ్ల తర్వాత ఇంటిని అమ్ముకునే హక్కు లబ్ధిదారులకు ఉందన్నారు. రిజిస్ట్రేషన్ పూర్తయిన తర్వాత ఇంటిని తాకట్టు పెట్టుకునేందుకు అనుమతి ఇవ్వనున్నట్లు తెలిపారు.

## రాయదుర్గంలో ఎకరం ధర రూ.269 కోట్లు.. ప్రభుత్వానికి కాసుల పంట

హైదరాబాద్: హైదరాబాద్ ఐటీ కారిడార్‌లో భూముల ధరలు మరోసారి రికార్డు సృష్టించాయి. రాయదుర్గంలో ఎకరం భూమి ధర ఏకంగా రూ.269 కోట్లు పలికింది. వారం క్రితం ఇక్కడే ఎకరం ధర రూ.264 కోట్లు పలకగా, తాజాగా దాని పక్కనే ఉన్న ప్లాట్‌లో ఎకరానికి రూ.269 కోట్లు పలకడం విశేషం. రాయదుర్గం సర్వే నంబరు 83/1లోని 5.38 ఎకరాలకు తాజాగా టీజీఐఐసీ వేలం నిర్వహించింది. కనీస ధర రూ.175 కోట్లుగా నిర్ణయించింది. రూ.10 కోట్లు ముందస్తుగా చెల్లించిన వారికి ఆన్‌లైన్ వేలంలో పాల్గొనేందుకు అవకాశం కల్పించారు. దీంతో పలు రియల్ ఎస్టేట్ సంస్థలు వేలంలో పోటీపడ్డాయి. చివరికి వంశీరాం బిల్డర్స్ ఎకరానికి రూ.269 కోట్ల చొప్పున 5.38 ఎకరాలను కొనుగోలు చేసింది. దీంతో టీజీఐఐసీ కాసుల పంట పండినట్లైంది. ఈ వేలం ద్వారా ప్రభుత్వానికి సుమారు రూ.1,447 కోట్లు సమకూరాయి.

## ఆయిల్‌పామ్ సాగు విస్తరణ కార్యక్రమం వేగవంతం చేయాలి: మంత్రి తుమ్మల



హైదరాబాద్: రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగు విస్తరణ కార్యక్రమం మరింత వేగవంతం చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. రైతుల్లో పెరుగుతున్న ఆసక్తికి అనుగుణంగా మొక్కల లభ్యత పెంచడంతోపాటు సకాలంలో మొక్కలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సచివాలయంలో వ్యవసాయ, సహకార శాఖల పరిధిలోని పలు అంశాలపై ఉన్నతాధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ పురోగతి, ఆయిల్‌పామ్ సాగు విస్తరణ, రసాయన ఎరువుల లభ్యత, యూరియా సరఫరా, ఇబ్బందులు, వ్యవసాయ యాంత్రీకరణ, రైతు వేదికలపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు తదితర అంశాలపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. రైతులకు వ్యవసాయ పనులు సులభతరం చేయడంతోపాటు సాగు ఖర్చులు తగ్గించేందుకు అమలు చేస్తున్న వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద రైతులకు అందించాల్సిన పనిముట్లను ఖరారు చేసినట్లు తెలిపారు. రైతుల అవసరాలకు అనుగుణంగా పనిముట్లను ఎంపిక చేసి పంపిణీ ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈసారి యాంత్రీకరణ పథకం కింద అందించే రాయితీ నిధులు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. యూరియా సరఫరాలో ఇబ్బందులు లేవని.. కేంద్రం ప్రవేశపెట్టిన ఫెర్టిలైజర్ యాప్ ద్వారా వచ్చే సమస్యలు పరిష్కరిస్తూ రైతులకు యూరియా సరఫరా చేస్తున్నామని మంత్రి తుమ్మల తెలిపారు. ఆగస్టు సరఫరా ప్రణాళికలో భాగంగా 1.50 లక్షల మెట్రిక్ టన్నులకు గాను 1.17 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను రాష్ట్రానికి తెప్పించగలిగామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఫెర్టిలైజర్ యాప్ వినియోగం, యాప్‌లో బుకింగ్, లభ్యత, కొనుగోలు ప్రక్రియ వంటి అంశాలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను తుమ్మల ఆదేశించారు.

## చెరువులు కనుమరుగవడంతోనే నగరాల్లో వరదలు: హైడ్రా కమిషనర్



హైదరాబాద్: నగరాల్లో వరదలు ముంచెత్తడానికి చెరువులు కనుమరుగవడమే ప్రధాన కారణమని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. హైదరాబాద్‌లో 3, 4 సెంటీమీటర్ల వర్షం వచ్చినా రహదారులపైకి నీరు చేరుతోందని చెప్పారు. ఇక్కడ చెరువులు ఆక్రమణలకు గురవడంతోపాటు ఇన్ లెట్లు సరిగ్గా లేవన్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించిన 'అర్బన్ ఎన్విరాన్‌మెంట్ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్' జాతీయ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. "దేశంలోని అనేక నగరాల్లో చెరువులు కబ్జాలకు గురవుతూ కనుమరుగవుతున్నాయి. ఢిల్లీలోని అనేక చెరువులు పార్కింగ్ యార్డులుగా మారాయి. హైడ్రా ద్వారా వస్తున్న మార్పులను గ్రహించి పశ్చిమ బెంగాల్ ఐఏఎస్ అధికారులు సంప్రదించారు. కోల్‌కతా నగరంలోనూ ఈ తరహా ఏజెన్సీ అవసరం ఉందని వారు పేర్కొన్నారు. తెలంగాణలో హైడ్రాను అడ్డుకునేందుకు ల్యాండ్ మాఫియాకు చెందిన వారు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ప్రజాప్రయోజనాల దృష్ట్యా వాటన్నింటినీ దాటుకొని ముందుకెళ్లాల్సిన అవసరం ఉంది. సామాజిక మాధ్యమాల్లో హైడ్రాపై అబద్ధాలు ప్రసారం చేస్తున్నారు. అనుమతి కలిగిన ఏ భవనాన్ని కూల్చే ప్రయత్నం జరగలేదు. కబ్జాలకు గురైన ప్రభుత్వ భూములను చట్ట ప్రకారమే రక్షిస్తున్నాం. రెండేళ్లలో 3,350 ఎకరాల కబ్జాలకు గురైన భూమిని రక్షించాం. దాని విలువ సుమారు రూ.1.50 లక్షల కోట్లు ఉంటుంది" అని రంగనాథ్ అన్నారు.

## తెలంగాణలో పెరిగిన క్రైమ్.. హైదరాబాద్‌లో తగ్గిన తీవ్రమైన నేరాలు



హైదరాబాద్: హైదరాబాద్‌లో తీవ్రమైన నేరాలు తగ్గినట్లు డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. తెలంగాణలో నేరాలపై పోలీసు అధికారులతో డీజీపీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వివరాలు వెల్లడించారు. తెలంగాణలో మూడేళ్లలో నేరాలు 7.15 శాతం పెరిగాయి. 202324లో 2,65,377 కేసులు నమోదు కాగా, 202526లో వీటి సంఖ్య 2,84,363కు పెరిగింది. డ్రగ్స్ కేసుల్లో 46.10% పెరుగుదల నమోదై 2,026 నుంచి 2,960 కేసులు పెరిగాయి. ఆర్గనైజ్డ్ క్రైమ్ కేసులు 25 నుంచి 451కి పెరిగాయి. ట్రాఫిక్ నేరాల్లో 9.48% పెరుగుదల నమోదైంది. మరోవైపు సైబర్ క్రైమ్ రేటు 13.29 శాతానికి తగ్గింది. ఆర్థిక నేరాలు 13.28%, తీవ్ర నేరాలు 10.33 శాతానికి తగ్గాయి. హైదరాబాద్ నగరంలో తీవ్రమైన నేరాలు 26.23% తగ్గగా, సైబరాబాద్‌లో డ్రగ్స్ కేసులు 90.98% పెరిగాయి. ఆదిలాబాద్‌లో డ్రగ్స్ కేసులు 57 నుంచి 219కి చేరాయి. సమీక్ష సందర్భంగా అధికారులకు డీజీపీ పలు సూచనలు ఇచ్చారు. నెలవారీ క్రైమ్ రివ్యూలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. క్రైమ్ రివ్యూలు కేవలం గణాంకాలకే పరిమితం కాకూడదన్నారు. నేరాల కారణాలు, పని విధానం, దర్యాప్తు నాణ్యత, కేసుల పరిష్కారంపై విశ్లేషణ చేయాలన్నారు. ఫీల్డ్ లెవల్ పోలీసింగ్‌ను బలోపేతం చేయాలని ఆదేశించారు. తనిఖీల్లో గుర్తించిన సమస్యలపై తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. నేర ధోరణులను ముందుగానే గుర్తించి యాక్షన్ ప్లాన్‌లు రూపొందించాలని పేర్కొన్నారు. క్రైమ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ (సీసీటీఎన్ఎస్) డేటా అప్‌డేట్ 96%కి చేరిందన్నారు. గతంలో ఈ ఇది 7080 శాతం ఉన్నట్లు పేర్కొన్నారు. ఏఐ, సీసీటీఎన్ఎస్, టీజీ కాప్, హాక్ఐ టెక్నాలజీ, ఈగల్, ఐసీజేఎస్, కొత్త క్రిమినల్ చట్టాల అమలుపైనా డీజీపీ సమీక్ష నిర్వహించారు. యూనిట్ స్థాయి జవాబుదారీతనం, సత్వర నిర్ణయాలు, ఫోకస్డ్ ఫీల్డ్ యాక్షన్‌పై ప్రత్యేక దృష్టిసారించాలని అధికారులను డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశించారు. డ్రగ్స్‌పై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు.

## హెల్మెట్ పెట్టుకో అన్నయ్యా.. రాఖీలు కట్టి చెప్పిన మహిళా ట్రాఫిక్ పోలీసులు




రక్షా బంధన్ పండుగను పురస్కరించుకుని కామారెడ్డి ట్రాఫిక్ పోలీసులు ఒక వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధించకుండా, మానవతా దృక్పథంతో రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. శుక్రవారం రక్షా బంధన్ వేడుకల సందర్భంగా, హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతున్న వారిని మహిళా ట్రాఫిక్ పోలీసులు నిలిపివేశారు. వారికి చలాన్లు విధించకుండా, నుదుటన తిలకం దిద్ది, చేతికి రాఖీలు కట్టారు. "అన్నయ్యా, హెల్మెట్ ధరించండి. మీ కోసం మీ కుటుంబం ఎదురుచూస్తోంది" అంటూ ఆప్యాయంగా చెప్పారు. హెల్మెట్ ధరించడాన్ని ఒక బాధ్యతగా, అలవాటుగా మార్చుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. "రక్షా బంధన్ సురక్షా బంధన్" పేరిట నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా, హెల్మెట్ ధరించడం కేవలం ట్రాఫిక్ నిబంధన మాత్రమే కాదని, అది మన ప్రాణాలను కాపాడే రక్షణ అని పోలీసులు నొక్కిచెప్పారు. రోడ్డు ప్రమాదాల సమయంలో ప్రాణాంతకమైన తల గాయాల నుంచి హెల్మెట్ రక్షణ కల్పిస్తుందని వారు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర మాట్లాడుతూ, హెల్మెట్ వాహనదారుడికి ఒక రక్షణ కవచం వంటిదని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యుల క్షేమాన్ని కాంక్షించి, సురక్షితంగా ప్రయాణించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పోలీసులు చేపట్టిన ఈ వినూత్న కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. భవిష్యత్తులో తప్పనిసరిగా హెల్మెట్ ధరిస్తామని పలువురు వాహనదారులు పోలీసులకు హామీ ఇచ్చారు.

## రాఖీ పండుగకు టీజీఎస్ఆర్టీసీ ఛార్జీల బాదుడు

- **రాఖీ పండుగ సందర్భంగా టీజీఎస్ఆర్టీసీ ఛార్జీల పెంపు**
- **ప్రత్యేక బస్సుల్లో సాధారణ ఛార్జీపై 50 శాతం అదనం**
- **రాష్ట్రవ్యాప్తంగా 5,000 ప్రత్యేక బస్సు సర్వీసులు**
- **1981 నాటి జీవో ప్రకారమే పెంపు అని అధికారుల వెల్లడి**
- **సాధారణ సర్వీసుల్లో ఛార్జీలు యథాతథం**




రాఖీ పౌర్ణమి వేళ ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినప్పటికీ, టికెట్ ధరలను భారీగా పెంచడంపై సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. పండుగ పూట తమ స్వగ్రామాలకు వెళ్లే సామాన్య ప్రయాణికులకు ఈ అదనపు ఛార్జీల బాదుడు భారంగా మారింది. రాఖీ పండుగను పురస్కరించుకుని ఆగస్టు 27 నుంచి 31 వరకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 5,000 ప్రత్యేక బస్సులను నడపాలని టీజీఎస్ఆర్టీసీ నిర్ణయించింది. అయితే, ఈ బస్సుల్లో సాధారణ ఛార్జీల కంటే 50 శాతం అదనంగా వసూలు చేస్తున్నారు. ఉదాహరణకు, మహాత్మా గాంధీ బస్ స్టేషన్ (ఎంజీబీఎస్) నుంచి జడ్చర్లకు సాధారణ ఛార్జీ రూ. 150 ఉండగా, ప్రత్యేక బస్సుల్లో దానిని రూ. 190కి పెంచారు. అదేవిధంగా, కరీంనగర్‌కు వెళ్లే సూపర్ డీలక్స్ బస్సులో సాధారణ టికెట్ ధర రూ. 300 ఉండగా, ప్రస్తుతం రూ. 400 వసూలు చేస్తున్నారు. ఛార్జీల పెంపుపై ముందస్తు సమాచారం లేకపోవడంతో బస్సు ఎక్కిన తర్వాత తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ధరల పెంపుపై ముందే ప్రకటన విడుదల చేస్తే బాగుండేదని పలువురు ప్రయాణికులు అభిప్రాయపడుతున్నారు. ఈ అంశంపై టీజీ ఎస్ఆర్టీసీ పీఆర్వో ప్రసన్న స్పందిస్తూ వివరణ ఇచ్చారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హయాంలో 1981లో వెలువడిన ప్రభుత్వ ఉత్తర్వుల (జీవో) ప్రకారం, పండుగ సమయాల్లో నడిపే ప్రత్యేక బస్సుల్లో సాధారణ ధర కంటే 1.5 రెట్లు అధికంగా వసూలు చేసే వెసులుబాటు సంస్థకు ఉందని ఆమె స్పష్టం చేశారు.

## ప్రజల నుంచి వాట్సాప్ ద్వారా దరఖాస్తులు వచ్చినా పరిష్కరించాలి: అధికారులకు మంత్రి జూపల్లి ఆదేశం

ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ నెలల తరబడి తిరిగే పరిస్థితి ఉండకూడదని... వాట్సాప్ లేదా ఈమెయిల్ ద్వారా దరఖాస్తు పంపినా అధికారులు తక్షణమే స్పందించాలని తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. పానగల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన ప్రజా సమస్యల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత రెండున్నర ఏళ్లుగా ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులు, వాటి పరిష్కారంపై అధికారులతో సుదీర్ఘంగా సమీక్షించారు.

# ఏ క్షణాన ఏం జరుగుతుందో.. పొంగిపొర్లుతోన్న సరస్సు: నేపాల్‌లో హైటెన్షన్

హిమాలయదేశం నేపాల్‌కు వరదముప్పు పూర్తిగా తొలగిపోలేదు. ఆకస్మిక వరదలు వచ్చిన రెండు రోజుల తర్వాత టిబెట్ వైపున ఉన్న ఒక సరస్సు కట్టలు తెంచుకొని ప్రవహిస్తోందని నేపాల్ (Nepal) వెల్లడించింది. వరద ప్రభావిత ప్రాంతంలో సహాయక చర్యలు చేపడుతోన్న బృందాలు అక్కడి నుంచి సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోవాలని హెచ్చరించింది. ''టిబెట్ వైపున ఒక సరస్సు నుంచి నీరు పొంగిపొర్లుతోందనే సమాచారం ఉంది. సహాయక చర్యల్లో పాల్గొంటున్న బృందాలు, భద్రతా సిబ్బంది, ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలి. అంతా సురక్షిత ప్రాంతానికి తరలివెళ్లాలి'' అని నేపాల్ పోలీసులు హెచ్చరించారు. సరస్సులో నీటి ప్రవాహం పెరుగుతోందని రసువా జిల్లా ఉన్నతాధికారి నరేంద్ర పరియార్ వెల్లడించారు. దీంతో స్థానికులు కొండ ప్రాంతాలవైపు తరలివెళ్తున్నారని తెలుస్తోంది. హిమానీనదం



(గ్లేసియర్) విరిగిపడటం నేపాల్‌లో బుధవారం నాటి జల ప్రళయానికి కారణమైంది. ఆ విపత్తు వల్ల పేరుకుపోయిన పెద్ద రాళ్లు, బురద, మంచు, ఇతర శిథిలాలతో టిబెట్ వైపున ఒక సరస్సు ఏర్పడింది. అక్కడ నీటి పరిమాణం పెరగడంతో ప్రస్తుతం అది పొంగిపొర్లుతోంది. దీంతో చైనా (China) కూడా సహాయక చర్యలు నిలిపివేసింది. టిబెట్‌లో మళ్లీ వరదముప్పు పొంచి ఉండటంతో ఈ నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ పరిస్థితులను సమీక్షించారు. టిబెట్ సరిహద్దులోని భోటే కోషి నదీ ప్రవాహం మొదలయ్యే దగ్గర కొత్తగా ఓ సరస్సు ఏర్పడిందని నేపాల్‌కు చైనా ఇప్పటికే అలర్ట్ ఇచ్చింది. గురువారం ఉదయం నాటికి 20లక్షల క్యూబిక్ మీటర్ల నీటితో ఉన్న ఈ సరస్సులోకి.. మూడు రోజుల్లో మరో 30లక్షల క్యూ. మీ నీరు చేరే అవకాశం ఉందని అంచనా వేసింది. దీంతో అది తెగిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే.

## కర్ణాటక మంత్రి నాగేంద్ర రెండోసారి రాజీనామా

బెంగళూరు: కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. వాల్మీకి కుంభకోణ ఆరోపణలపై ఆ పార్టీ నేత బి.నాగేంద్ర తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. గతంలోనూ ఇవే ఆరోపణలపై ఆయన పదవి నుంచి తప్పుకొన్నారు. డీకే శివకుమార్ సీఎంగా బాధ్యతల చేపట్టిన తర్వాత మంత్రివర్గంలో చేరిన నాగేంద్ర.. విపక్షాల అవినీతి ఆరోపణల వేళ మరోసారి మంత్రి పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. తన రాజీనామా నిర్ణయాన్ని ప్రకటిస్తూ మీడియా ముందు ఒకింత భావోద్వేగానికి గురయ్యారు. ఇదీ నేపథ్యం: మహర్షి వాల్మీకి షెడ్యూల్డ్ తెగల అభివృద్ధి కార్పొరేషన్‌లో అకౌంట్స్ సూపరింటెండెంట్‌గా



పనిచేసిన పి.చంద్రశేఖరన్ 2024 మే నెలలో ఆత్మహత్య చేసుకున్నారు. కార్పొరేషన్ నిధుల దుర్వినియోగం జరిగిందని ఆరోపిస్తూ ఓ లేఖ రాశారు. కార్పొరేషన్ ఖాతా నుంచి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతాకు రూ.89.63 కోట్లు, అక్కడి నుంచి మరికొన్ని ఖాతాలకు ఆ నిధులు బదిలీ అయినట్లు విచారణలో తేలింది. దీంతో అప్పట్లో రాజకీయంగా దుమారం రేగింది. ఈ వివాదం సమయంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్న నాగేంద్ర 2024 జూన్‌లో పదవికి రాజీనామా చేశారు. అయితే, తనపై వచ్చిన ఆరోపణలన్నీ రాజకీయ ప్రేరేపితమైనవని నాగేంద్ర పేర్కొన్నారు. ఈ క్రమంలోనే సీఎంగా డీకే శివకుమార్ బాధ్యతలు చేపట్టాక రెండోసారి మంత్రివర్గంలో చేరారు. దీంతో ఆయన్ను తొలగించాలంటూ ప్రతిపక్షాలు మరోసారి రాజీనామా డిమాండ్‌ను తెరపైకి తీసుకొచ్చాయి. ఇటీవలి వర్షాకాల సమావేశాల సమయంలోనూ శాసనసభ లోపల, బయటా ఇదే అంశంపై భాజపా, జేడీఎస్ నిరసనలు తెలిపాయి. రాజకీయంగా ఒత్తిడి పెరగడంతో ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను కలిసిన అనంతరం నాగేంద్ర తన రాజీనామా నిర్ణయాన్ని ప్రకటించారు.

## కేంద్ర క్యాబినెట్ నుంచి తప్పించేందుకు కుట్ర! - జుయెల్ ఓరం

కేంద్ర గిరిజన వ్యవహారాలశాఖ మంత్రి జుయెల్ ఓరం (Jual Oram) చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. తనను కేంద్ర మంత్రివర్గం నుంచి తొలగించేందుకు భాజపాలోని కొందరు కుట్ర చేస్తున్నారని ఆయన ఆరోపించారు. తన ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఇందుకోసం డబ్బులు కూడా ఖర్చు చేస్తున్నారని పేర్కొన్నారు. వ్యవస్థీకృత నేరానికి సంబంధించిన కేసులో మంత్రి సహాయకుడు అరెస్టైన నేపథ్యంలో ఓరం ఈ వ్యాఖ్యలు చేయడం



గమనార్హం. ''ఇతర పార్టీల నుంచి భాజపాలో చేరిన కొందరు నేతలు నా ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు, నా స్థాయిని దిగజార్చేందుకు ఈ మధ్య ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఇందుకోసం డబ్బులు కూడా ఖర్చు చేస్తున్నారు. నేను వైదొలిగితే కేంద్ర మంత్రి వర్గంలో అవకాశం లభిస్తుందని వాళ్లు భావిస్తున్నారు. ఈ పార్టీ (భాజపా) గురించి నాకు బాగా తెలుసు. అది నా సేవలను గుర్తిస్తుంది'' అని విలేకరులతో కేంద్రమంత్రి పేర్కొన్నారు. కుట్రలో భాగమైన వారిని గుర్తిస్తానని, ఇప్పటికే ఈ విషయాన్ని రాష్ట్ర భాజపా కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు. ఎన్నికల్లో ఎప్పటికీ పోటీ చేయకూడదని గతంలో ప్రకటించానని, అయితే, ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా వచ్చే ఎన్నికల్లో కచ్చితంగా పోటీ చేస్తానని అన్నారు. ఒడిశాలోని రవూర్కెలాలో ఉన్న ప్రభుత్వ అతిథి గృహంలో కొందరు నేరస్థులకు ఆశ్రయం కల్పించారన్న ఆరోపణలపై కేంద్ర మంత్రి సహాయకుడు రాకేశ్ పశవాన్‌ను పోలీసులు ఇటీవల అరెస్టు చేశారు. దీనిపై ఇటీవల స్పందించిన కేంద్ర మంత్రి ఓరం.. రాకేశ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు తనకు ఎటువంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. ఇదిలాఉంటే, సుందర్‌గఢ్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఓరం.. ఆరుసార్లు ఎంపీగా గెలిచారు.

## కేంద్ర క్యాబినెట్ నుంచి తప్పించేందుకు కుట్ర! – జుయెల్ ఓరం

కేంద్ర గిరిజన వ్యవహారాలశాఖ మంత్రి జుయెల్ ఓరం చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. తనను కేంద్ర మంత్రివర్గం నుంచి తొలగించేందుకు భాజపాలోని కొందరు కుట్ర చేస్తున్నారని ఆయన ఆరోపించారు. తన ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఇందుకోసం డబ్బులు కూడా ఖర్చు చేస్తున్నారని పేర్కొన్నారు. వ్యవస్థీకృత నేరానికి సంబంధించిన కేసులో మంత్రి సహాయకుడు అరెస్టైన నేపథ్యంలో ఓరం ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ''ఇతర పార్టీల నుంచి భాజపాలో చేరిన కొందరు నేతలు నా ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు, నా స్థాయిని దిగజార్చేందుకు ఈ మధ్య ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఇందుకోసం డబ్బులు కూడా ఖర్చు చేస్తున్నారు. నేను వైదొలిగితే కేంద్ర మంత్రి వర్గంలో అవకాశం లభిస్తుందని వాళ్లు భావిస్తున్నారు. ఈ పార్టీ (భాజపా) గురించి నాకు బాగా తెలుసు. అది నా సేవలను గుర్తిస్తుంది'' అని విలేకరులతో కేంద్రమంత్రి పేర్కొన్నారు. కుట్రలో భాగమైన వారిని గుర్తిస్తానని, ఇప్పటికే ఈ విషయాన్ని రాష్ట్ర భాజపా కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు. ఎన్నికల్లో ఎప్పటికీ పోటీ చేయకూడదని గతంలో ప్రకటించానని, అయితే, ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా వచ్చే ఎన్నికల్లో కచ్చితంగా పోటీ చేస్తానని అన్నారు. ఒడిశాలోని రవూర్కెలాలో ఉన్న ప్రభుత్వ అతిథి గృహంలో కొందరు నేరస్థులకు ఆశ్రయం కల్పించారన్న ఆరోపణలపై కేంద్ర మంత్రి సహాయకుడు రాకేశ్ పశవాన్‌ను పోలీసులు ఇటీవల అరెస్టు చేశారు.



దీనిపై ఇటీవల స్పందించిన కేంద్ర మంత్రి ఓరం.. రాకేశ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు తనకు ఎటువంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. ఇదిలాఉంటే, సుందర్‌గఢ్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఓరం.. ఆరుసార్లు ఎంపీగా గెలిచారు.



## కొలంబియా యూనివర్సిటీతో VIT అవగాహన ఒప్పందం

అమెరికా న్యూయార్క్‌లోని ప్రఖ్యాత కొలంబియా యూనివర్సిటీతో (కొలంబియా ఇంజినీరింగ్) వెలూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఐటీ) అవగాహన ఒప్పందం (MoU) కుదుర్చుకుంది. న్యూయార్క్‌లోని భారత కాన్సుల్ జనరల్ బినయ శ్రీకాంత ప్రధాన్ సమక్షంలో వీఐటీ ఛాన్సలర్ డా. జి. విశ్వనాథన్, కొలంబియా ఇంజినీరింగ్ అకడమిక్ అఫైర్స్ అండ్ గ్లోబల్ పార్ట్‌నర్‌షిప్స్ డీన్ సెన్. సొలేమానే కచాని అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. దీంతో కొలంబియా యూనివర్సిటీతో డ్యూయల్ డిగ్రీ ఒప్పందం కుదుర్చుకున్న తొలి భారతీయ విశ్వవిద్యాలయంగా వీఐటీ నిలిచింది. దీనివల్ల ఇంజినీరింగ్ విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో విద్యా అవకాశాలు, నాణ్యమైన విద్య అందుబాటులోకి రానుంది. ఈ సందర్భంగా దీన్నొక కీలక ఘట్టంగా డా|| జి.విశ్వనాథన్ అభివర్ణించారు. ఈ భాగస్వామ్య ఒప్పందంతో VIT ఇంజినీరింగ్ విద్యార్థులకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్యను అభ్యసించే అవకాశం ఏర్పడుతుంది. అంతర్జాతీయంగా కెరీర్‌ను నిర్మించుకునేందుకు సరికొత్త మార్గాలు ఏర్పడతాయి. ఈ కార్యక్రమంలో VIT ఉపాధ్యక్షుడు డా. జి. వి. సెల్వం, డైరెక్టర్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ డా. ఆర్. శీనివాసన్ పాల్గొన్నారు.

## ప్రచురణ వివాదంలో సోనియా ఆత్మకథ.. స్పందించిన పెంగ్విన్ ఇండియా

కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ తన జీవిత ప్రయాణంపై 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్' పేరిట ఆత్మకథను తీసుకువస్తోన్న సంగతి తెలిసిందే. దీని ప్రచురణకు సంబంధించి నెట్టింట ఓ వార్త చక్కర్లు కొట్టింది. కంటెంట్ మార్పు విషయంలో వచ్చిన విభేదాల కారణంగా పెంగ్విన్ ర్యాండమ్ హౌస్ ఇండియా ఈ పుస్తక ప్రచురణ నుంచి వైదొలిగినట్లు ప్రచారం జరిగింది. దీంతో ఈ ఊహాగానాలపై పెంగ్విన్ ఇండియా తాజాగా స్పందించింది. ఆ వార్తలు అవాస్తవమని తెలిపింది. '''బిలాంగింగ్' పుస్తకానికి భారత్‌లో పెంగ్విన్ ర్యాండమ్ హౌస్ ఇండియా ప్రచురణకర్త కాదు. ఈ పుస్తకంలో ప్రతిపాదించిన మార్పులను చేసేందుకు రచయిత తిరస్కరించినందుకే మేం బుక్ పబ్లిష్ చేయకూడదని నిర్ణయించుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇవి



వాస్తవ పరిణామాలకు భిన్నంగా ఉన్నాయి. ఒక, ప్రచురణకర్తగా వాస్తవాలను సరిచూసుకోవడం మా బాధ్యత. అందుకు అవసరమైతే రచయితలకు కొన్ని సిఫార్సులు కూడా చేస్తుంటాం. ఇది పబ్లిషింగ్ ప్రక్రియలో సాధారణ ప్రక్రియే. ఈ పుస్తకం విషయంలోనూ మేం కొన్ని చర్చలు జరిపాం. ఆ సమయంలో ప్రచురణకు ఆసక్తిగా ఉన్నప్పటికీ.. కొన్ని కారణాల వల్ల ఆ బాధ్యతలను తీసుకోలేదు. అయితే, ఇక్కడ రచయితతో జరిగిన రహస్య చర్చలపై మేం వ్యాఖ్యానించబోం'' అని పెంగ్విన్ ఇండియా తమ ప్రకటనలో పేర్కొంది. 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్' పేరిట సోనియా గాంధీ 544 పేజీల ఆత్మకథ నవంబరు 10న పాఠకుల ముందుకు రానుంది. ''నా జీవితాన్ని అక్షరబద్ధం చేయడమంటే నా మనసు లోతుల్లో దాచుకున్న జ్ఞాపకాల దొంతరలను విడమర్చడం, అనుభవాలను పంచుకోవడమే. నా జీవితం గురించి రాయడం నాకు అంత సులువు కాలేదు'' అని సోనియా ఇప్పటికే పేర్కొన్నారు. భారత్ 'నాకు చెందిన అందమైన దేశం' అని ఆమె అభివర్ణించారు.

## రష్యాపై ఆంక్షలు.. కెనడాలో రోడ్లపై కార్లు మాయం..!

రష్యాపై పాశ్చాత్య దేశాలు ఆంక్షలు విధిస్తే.. కెనడాలో కార్ల దొంగతనాలు ఎందుకు జరుగుతున్నాయి..? ఆ ఆంక్షలకు.. ఈ దొంగతనాలకు సంబంధం ఏంటి..? ఆ దేశాల నుంచి రష్యాకు కార్ల ఎగుమతులపై విధించిన నిషేధానికి.. నాలుగేళ్లుగా కెనడాలో కార్ల దొంగతనాలకు ప్రత్యక్ష సంబంధం ఉందని ఓ అంతర్జాతీయ మీడియా కథనం తాజాగా వెల్లడించింది. 2022లో ఉక్రెయిన్‌పై రష్యా సైనిక చర్యను ప్రారంభించిన సంగతి తెలిసిందే. దాంతో పుతిన్ ప్రభుత్వం కఠిన ఆంక్షలను ఎదుర్కొంది. వాటి కారణంగా ఐరోపా యూనియన్, యూఎస్, యూకే, కెనడా, జపాన్ నుంచి రష్యాకు కార్లు, విలాసవంతమైన వాహనాలు, వాటికి సంబంధించిన విడిభాగాల ప్రత్యక్ష ఎగుమతికి తీవ్ర ఆటంకం ఏర్పడింది. 50 వేల డాలర్ల కంటే ఎక్కువ విలువైన వాహనాల ఎగుమతులపై నిషేధం అమల్లో ఉంది. దాంతో రష్యా సంపన్న వర్గాలకు ఈ కార్లు అందుబాటులో లేకుండా పోయాయి. పాశ్చాత్య సంస్థలు వెళ్లిపోయిన తర్వాత చైనా ఆటోమొబైల్ సంస్థలు ఆ ఖాళీని పూర్తి చేశాయి. రష్యా ప్యాసింజర్ కార్ మార్కెట్‌లో 60 శాతం వాటాను ఆక్రమించాయి. కానీ స్టేటస్‌కు తగ్గట్టుగా కార్లను కోరుకునే వారు డ్రాగన్ కార్లపై మక్కువ చూపడం లేదు. వారు ల్యాండ్ రోవర్లు, డాడ్జ్ రామ్స్, ఫోర్డ్ ఎఫ్150నే ఇష్టపడుతున్నారు. కానీ డిమాండ్‌కు తగ్గట్టుగా కార్ల విషయంలో చట్టపరమైన మార్గాలు లేకుండాపోయాయి. ఈ



లోటును గుర్తించిన ముఠాలు ఒక వ్యవస్థీకృత సరఫరా గొలుసును నిర్మించాయి. అప్పుడు వారి చూపు కెనడా వైపు పడింది. ఆ దేశ తయారీ రంగంలో ఆటోమొబైల్ పరిశ్రమ కీలమైంది. ఖరీదైన ఎస్‌యూవీలు, పికప్ ట్రక్కులను భారీస్థాయిలో తయారు చేస్తోంది. అదీగాక ఉత్తర అమెరికాలో అతిపెద్ద కంటైనర్ టర్మినల్ అయిన పోర్ట్ మాంట్రియల్ ఆ దేశంలోనే ఉంది. రష్యాలో కావాలనుకునే బ్రాండ్లు, మోడళ్లు, పరిమాణం గురించి ఆ ముఠా తొలుత సమాచారం తెలుసుకుంటుంది. ఆ ఆర్డర్లకు తగ్గట్టుగా కెనడాలో యువకులను రంగంలోకి దింపుతుంది. తమకు వీలుగా ఉందని ఏదో ఒక వాహనాన్ని వారు దొంగిలించరు. ఆర్డర్ ప్రకారమే.. టార్గెట్ చేసిన కారునే కొట్టేస్తారు. ఒక దొంగ కారును దొంగిలించి.. 500 డాలర్ల నుంచి 1500 డాలర్ల వరకు సంపాదిస్తున్నాడు. తర్వాత మాంట్రియల్ టర్మినల్ వద్దకు వాటిని తీసుకువస్తారు.

## నేపాల్‌లో 579 మంది మృతి.. కిలో మీటర్ల దూరం కొట్టుకువచ్చిన మృతదేహాలు

నేపాల్ వరదల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలను రెస్క్యూ బృందాలు ముమ్మరం చేశాయి. ఈ క్రమంలో ఇప్పటివరకు 579 మృతదేహాలు వెలికితీసినట్లు నేపాల్ పోలీసులు వెల్లడించారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందన్నారు. ఈ విపత్తులో ఇప్పటివరకు 1473 మంది గాయాలపాలైనట్లు పేర్కొన్నారు.

**320 మంది భారతీయులు గల్లంతు..**

మరోవైపు, నేపాల్‌లో 320 మంది భారతీయల ఆచూకీ ఇంకా తెలియలేదని భారత విదేశాంగశాఖ వెల్లడించింది. చైనా వైపు 400 మంది భారతీయులు సురక్షితంగా ఉన్నారని, వారిలో 96 మంది రోడ్డు మార్గంలో సురక్షితంగా నేపాల్‌లోకి ప్రవేశించారని పేర్కొంది. మరో 21 మంది కాఠ్‌మాండూ నుంచి దిల్లీకి చేరుకున్నారని తెలిపింది.

*** కిలో మీటర్ల దూరం కొట్టుకువచ్చిన**



**మృతదేహాలు..**

నదీ పరివాహక ప్రాంతంలో మృతదేహాలను వెలికితీసే ప్రయత్నాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో యూపీలోని మహారాజ్‌గంజ్ జిల్లాలో నాలుగు, కుషీనగర్ జిల్లాలో మూడు మృతదేహాలు లభ్యమయ్యాయని అధికారులు వెల్లడించారు. ఇవి నేపాల్ నుంచి కొట్టుకువచ్చినట్లు భావిస్తున్నామని మహారాజ్‌గంజ్ జిల్లా మెజిస్ట్రేట్ గౌరవ్ సింగ్ సోగార్వాల్ తెలిపారు. ఈ మృతదేహాలు ఎవరివనే విషయం ఇంకా నిర్ధరణ కాలేదని, ఇదే విషయంపై నేపాల్ అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు చెప్పారు.

**చైనా వైపు 558 మంది..**

టిబెట్‌లోని చైనా నేపాల్ సరిహద్దులో ఉన్న గిరోంగ్ కౌంటీలో సంభవించిన ఆకస్మిక వరదల్లో 558 మంది గల్లంతైనట్లు చైనా వెల్లడించింది. ఐదుగురు ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపింది. గల్లంతైన వారిలో 260 మంది విదేశీయులే ఉన్నారని పేర్కొన్నప్పటికీ వారి వివరాలు మాత్రం వెల్లడించలేదు. ఇదిలా ఉంటే, టిబెట్ వైపున ఉన్న ఒక సరస్సు కట్టలు తెంచుకొని ప్రవహిస్తోందని నేపాల్ వెల్లడించింది. వరద ప్రభావిత ప్రాంతంలో సహాయక చర్యలు చేపడుతోన్న బృందాలు అక్కడి నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని హెచ్చరించింది.

## హర్మ్యాజ్‌లో సీమైన్స్‌ను తొలగించేశాం: అమెరికా ప్రకటన

హర్మ్యాజ్ జలసంధి తమ ఆధీనంలో ఉందని నిరూపించుకొనేందుకు అమెరికా కీలక అడుగు వేసింది. ఇప్పుడు ఆ జలసంధి సురక్షితం అనే భావన ప్రపంచానికి కల్పించేందుకు అత్యంతక కీలక ప్రకటన చేసింది. పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభంకాగానే హర్మ్యాజ్‌ను తన నియంత్రణలోకి తెచ్చుకున్న ఇరాన్.. దానిలోని అంతర్జాతీయ నౌకా మార్గాల్లో సీమైన్స్‌ను పరిచింది. దాంతో ఇరాన్ చెప్పిన మార్గంలో ఇతర మార్గాల్లో వెళ్లిన పలు నౌకలు వాటిని ఢీకొని పేలిపోయిన సంగతి తెలిసిందే. నౌకాయానానికి ఆటంకం కలిగిస్తోన్న ఆ సీమైన్స్‌ను పూర్తిగా తొలగించినట్లు తాజాగా యూఎస్ సెంట్రల్ కమాండ్ సంచలన ప్రకటన చేసింది. వీటి తొలగింపు ఆపరేషన్ రహస్యంగా చేపట్టినట్లు పేర్కొంది.






## ఇంజినీర్ల కంటే
# ఎంబీఏలకే 59% అధిక వేతనం

* **టాప్ 10 బిజినెస్ స్కూళ్లలో సగటు ప్యాకేజీ రూ.27.4 లక్షలు**
* **డెలాయిట్ ఇండియా నివేదిక**

ఇప్పుడు హవా అంతా ఇంజినీరింగ్‌దే.. మార్కెటింగ్, ఫైనాన్స్ విభాగాల్లో ఉన్నతోద్యోగాలకు ఉపయోగపడే ఎంబీఏ (మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్) ప్రభ తగ్గుతోంది అనుకోవడం పొరబాటే. ఎందుకంటే కళాశాల ప్రాంగణ ఎంపికల్లో ఇంజినీరింగ్ పొజిషన్లతో పోలిస్తే ఎంబీఏ చేసిన వారికి అధిక వేతన ఆఫర్లు దక్కుతున్నాయని డెలాయిట్ ఇండియా పేర్కొంది. 505 దిగ్గజ కళాశాలల్లో నియామక ఎంపికల తీరు ఆధారంగా నివేదికను సంస్థ రూపొందించింది. ఎంబీఏ, బీటెక్, బీబీఏ, బీకామ్ తదితర విభాగాల్లో టాప్10 తర్వాత 40 ర్యాంకుల్లో ఉన్న క్యాంపస్‌లలో సర్వే చేపట్టి 'క్యాంపస్ వర్క్‌ఫోర్స్ ట్రెండ్స్ 2026' పేరిట ఒక నివేదికను విడుదల చేసింది. ఇంజినీరింగ్ విషయానికొస్తే నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్) ప్రకారం 1140 ర్యాంకుల్లో ఉన్న సంస్థల్లో డెలాయిట్ సర్వే నిర్వహించింది. అందులో బిట్స్ పిలానీ, ఐఐటీ ఇండోర్, ఎన్ఐటీ రవుర్కెలా, ఐఐటీ ధన్‌బాద్, ఎన్ఐటీ కాలికట్ వంటివి ఉన్నాయి. టైర్1 ఎంబీఏ విభాగంలో రాయ్‌పుర్, తిరుచ్చి, కాశీపుర్, నాగ్‌పుర్ వంటి కొత్త ఐఐఎమ్‌లతో పాటు ఐఐటీ బాంబే, ఐఐటీ మద్రాస్, ఐఐటీ ఖరగ్‌పూర్‌లోని మేనేజ్‌మెంట్ స్కూళ్లు, ఎస్‌పీ జైన్, ఐఎమ్ఐ దిల్లీ వంటి ప్రైవేటు సంస్థలూ ఉన్నాయి.

**ప్యాకేజీలిలా..**

2026 సంవత్సరానికి ప్లేస్‌మెంట్లు పొందిన ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులకు దక్కిన ప్యాకేజీలతో పోలిస్తే ఎంబీఏ విద్యార్థులకు 52% అధిక వేతనాలు లభించాయి. 2027




ప్లేస్‌మెంట్‌లలో ఈ వృద్ధి 59 శాతానికి చేరొచ్చని అంచనా. 2025లో ఈ అంతరం 47 శాతంగా ఉంది. అంటే ఏడాదికేడాది ఎంబీఏ, ఇంజినీరింగ్ క్యాంపస్ ప్లేస్‌మెంట్ వేతనాల అంతరం పెరుగుతూ వస్తోంది. ఈ ఏడాదిలోనూ 250 కంపెనీలు (రిక్రూటర్లు) టెక్నికల్ హోదాల కంటే మేనేజ్‌మెంట్ ఆధారిత లీడర్‌షిప్/హోదాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు డెలాయిట్ పార్టనర్ నీలేశ్ గుప్తా తెలిపారు.

**మారిన కంపెనీల తీరు**

క్యాంపస్ నియామకాలను పెంచుకోవడం కోసం విడిగా నియామక బృందాలను 80% పైగా కంపెనీలు నియమించుకున్నాయి. ఆఫర్ ఇచ్చిన తర్వాత, ఉద్యోగంలో చేరే వారి సంఖ్య కూడా అన్ని డిగ్రీ విభాగాల్లో పెరిగింది. కృత్రిమ మేధ (ఏఐ) వల్ల కొత్త ఉద్యోగాలు/నైపుణ్యాల అవసరం వచ్చిందని 35% సంస్థలు అభిప్రాయపడుతున్నాయి. ఏఐ వల్ల నియామకాల తీరూ మారిందని 86% కంపెనీలు అంటున్నాయి. రెజ్యూమె స్క్రీనింగ్, అసెస్‌మెంట్స్, అభ్యర్థి ఎవాల్యుయేషన్‌లలో ఏఐ పాత్ర పెరిగిందని సంస్థలు పేర్కొన్నాయి.

**విద్యా సంస్థలను బట్టే ప్యాకేజీలు..**

టాప్ 10 విద్యాసంస్థల్లో ఎంబీఏ సగటు వార్షిక వేతన ప్యాకేజీ రూ.27.4 లక్షలుగా ఉండగా, టైర్3 విద్యా సంస్థల్లో ఇది రూ.8.4 లక్షలుగా ఉంది. ఇదే విషయంలో బీటెక్ గ్రాడ్యుయేట్లకు ఇవి వరుసగా రూ.18.7 లక్షలు, రూ.5.75 లక్షలుగా ఉన్నాయి.

# త్వరలో జియో ఐపీఓ.. సెబీ నుంచి గ్రీన్ సిగ్నల్

దిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన డిజిటల్ సేవల విభాగం జియోప్లాట్‌ఫామ్స్ లిమిటెడ్ ఐపీఓకు సంబంధించి మరో కీలక ముందడుగు పడింది. ఐపీఓ ద్వారా నిధులు సమీకరించేందుకు మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ నుంచి కంపెనీ అనుమతి పొందింది. సుమారు 4 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.37,700 కోట్లు) సమీకరించే అవకాశం ఉంది. దీంతో దేశంలోనే అతిపెద్ద ఐపీఓగా జియో రికార్డు సృష్టించనుంది. జియో ప్లాట్‌ఫామ్స్ జూన్‌లోనే ప్రతిపాదిత పబ్లిక్ ఇష్యూ కోసం మార్కెట్ నియంత్రణ సంస్థకు ముసాయిదా పత్రాలు సమర్పించింది. ఆగస్టు 28న సెబీ తుది పరిశీలన పొందింది. పబ్లిక్ ఇష్యూకు సెబీ పచ్చజెండా ఊపిన నేపథ్యంలో నియంత్రణ సంస్థల నిబంధనలకు లోబడి నిధుల సమీకరణకు సన్నాహాలు ప్రారంభించొచ్చు. డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ ప్రకారం.. పబ్లిక్ ఇష్యూలో భాగంగా




27 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించనుంది. మొత్తం ఈక్విటీలో 2.9 శాతం మేర వాటాను తగ్గించుకోనుంది. కొన్నేళ్లుగా జియో ఐపీఓ కోసం మదుపర్లు, మార్కెట్ విశ్లేషకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

**అతిపెద్ద ఐపీఓ**

కంపెనీ 137 బిలియన్ డాలర్ల మార్కెట్ విలువ వద్ద సుమారు రూ.37,700 కోట్లు సమీకరించొచ్చని అంచనా వేస్తున్నారు. అదే జరిగితే ఐపీఓ చరిత్రలో అతిపెద్ద ఐపీఓగా నిలవనుంది. ప్రస్తుతం హ్యుందాయ్ మోటార్ పేరిట రూ.27వేల కోట్ల ఐపీఓ రికార్డు ఉంది. త్వరలో నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ కూడా మెగా ఐపీఓకు సన్నద్ధమవుతోంది. సుమారు రూ.30వేల కోట్లు సమీకరించనుంది. జియోలో 2020లో మెటా రూ.43,574 కోట్లు (9.99 శాతం వాటా), గూగుల్ రూ.33,737 కోట్లు (7.73 శాతం వాటా) పెట్టుబడిగా పెట్టాయి. వ్యూహాత్మక పెట్టుబడిదారుల నుంచి మరో రూ.74,745 కోట్లు జియో సమీకరించింది.

# ఓలా నుంచి కొత్త స్కూటర్.. సింగిల్ ఛార్జ్‌తో 301km

దిల్లీ: ప్రముఖ విద్యుత్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ (Ola Electric) దేశీయ విపణిలోకి కొత్త ఎలక్ట్రిక్ స్కూటర్‌ను విడుదల చేసింది. మాస్ మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకుని ఎస్1జడ్ (Ola S1Z) మోడల్‌ను లాంచ్ చేసింది. సొంతంగా అభివృద్ధి చేసిన భారత్ సెల్ ఎల్ఎఫ్‌పీ టెక్నాలజీని ఇందులో వినియోగించారు. దీన్ని ఓలా తన గిగా ఫ్యాక్టరీలో తయారు చేసింది. తక్కువ ధరలో, అధిక రేంజ్ స్కూటర్‌ను అందించేందుకు ఇది ఉపయోగపడుతుందని



కంపెనీ ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ స్కూటర్ రెండు వేరియంట్లలో లభ్యమవుతుంది. 3.1kWh, 5.1kWh బ్యాటరీ ప్యాక్‌లతో లభిస్తుంది. చిన్న బ్యాటరీ వేరియంట్ ధర రూ.79,999 (ఎక్స్‌షోరూమ్)గా నిర్ణయించింది. ఇది సింగిల్ ఛార్జ్‌తో 179 కిలోమీటర్ల ఐడీసీ రేంజ్ ఇస్తుందని కంపెనీ పేర్కొంది. ఇక 5.1kWh బ్యాటరీ వేరియంట్ రూ.99,999కి లభ్యమవుతుంది. ఇది ఒకసారి ఛార్జ్ చేస్తే 301 కిలోమీటర్లు ప్రయాణించొచ్చని కంపెనీ పేర్కొంది. మొత్తం నాలుగు రంగుల్లో లభిస్తుంది. భారత్ సెల్ ఎల్ఎఫ్‌పీ టెక్నాలజీని ఇన్‌హౌస్‌లో అభివృద్ధి చేయడం ద్వారా బ్యాటరీ ఖర్చును గణనీయంగా తగ్గించగలిగామని ఓలా పేర్కొంది. అలాగని, ఇతర అంశాల్లో రాజీ పడకుండా తక్కువ ధరలో ఎస్1జడ్‌ను తీసుకొచ్చినట్లు తెలిపింది. 3.1kWh బ్యాటరీ వేరియంట్ కలిగిన స్కూటర్లను ఈ ఏడాది డిసెంబర్ నుంచి, పెద్ద బ్యాటరీ కలిగిన స్కూటర్లను వచ్చే ఏడాది మార్చి నుంచి డెలివరీ చేస్తామని తెలిపింది. మూవ్ ఓఎస్ 5తో ఈ స్కూటర్ పనిచేస్తుంది. క్రూయిజ్ కంట్రోల్, రివర్స్ మోడ్, జీపీఎస్, ఓటీఏ ద్వారా సాఫ్ట్‌వేర్ అప్‌డేట్స్, జియో, టైమ్, మోడ్ ఫెన్సింగ్ వంటి సదుపాయాలు ఇందులో ఉన్నట్లు ఓలా పేర్కొంది.

# తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరలు ఇలా..

పెళ్లిళ్లు, శుభకార్యాలు అనగానే ముందుగా గుర్తొచ్చేది బంగారమే. అంతగా మన సంస్కృతి, సంప్రదాయాలతో ముడిపడిపోయింది ఈ లోహం. అంతేకాదు.. పెట్టుబడికి పెట్టాలనుకునే వారికి పసిడి మంచి సాధనం. పసిడితో పాటు వెండికీ మంచి గిరాకీనే ఉంది. అందుకే వీటి ధరలను ఎప్పటికప్పుడు తెలుసుకోవడం ఎంతో ముఖ్యం. మరి తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలైన హైదరాబాద్, విజయవాడ, విశాఖ నగరాల్లో వాటి ధరలు ఎలా ఉన్నాయో చూడండి..

**బంగారం గురించి..**

* బంగారం స్వచ్ఛతను క్యారట్లల్లో కొలుస్తారు. క్యారట్ల వాల్యూ పెరిగే కొద్దీ బంగారం స్వచ్ఛత, ధర పెరుగుతాయి. మేలిమి బంగారాన్ని 24 క్యారట్లుగా చెబుతారు. అంటే ఇది 99.9 స్వచ్ఛమైన బంగారమన్నమాట. ఇది కాయిన్స్, బార్స్, బిస్కెట్ల రూపంలో మాత్రమే దొరుకుతుంది.
* నగల తయారీకి 22 క్యారట్ల స్వచ్ఛతతో కూడిన బంగారాన్ని వినియోగిస్తారు. ఇందులో ఇతర లోహాలు కలుపుతారు. బంగారంతో చేయించుకునే ఆభరణాలన్నీ 22 క్యారెట్లు/916 స్వచ్ఛతతో ఉంటాయి. ఈ ధర కోసం మేలిమి బంగారం ధరను 91.6 శాతంతో గుణిస్తే సరిపోతుంది.

| | బంగారం (24క్యా)(10గ్రా) | ఆర్నమెంట్ (22క్యా)(10గ్రా) | వెండి (కిలో) |
|---|---|---|---|
| హైదరాబాద్ | 1,63,560 | 1,48,150 | 2,49,225 |
| విజయవాడ | 1,58,255 | 1,46,800 | 2,47,000 |
| ప్రొద్దుటూరు | 1,52,800 | 1,40,580 | 2,40,000 |
| రాజమహేంద్రవరం | 1,59,820 | 1,46,500 | 2,60,000 |
| విశాఖపట్నం | 1,61,140 | 1,47,700 | 2,51,000 |
| తమిళనాడు | ----- | 1,48,000 | 2,65,000 |

# అదే కొలంబో టెస్టులో కోహ్లీ ఉండుంటే.. ఫలితం మరోలా..: మహ్మద్ కైఫ్

ఒక్క రోజులో నాలుగు వికెట్లను తీయలేక ఇబ్బంది పడిన భారత బౌలర్లు శ్రీలంకతో (IND vs SL) రెండో టెస్టును డ్రా చేసుకోవాల్సి వచ్చింది. దీంతో ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో పర్సంటేజీ కూడా తగ్గిపోయింది. ప్రత్యర్థికి ఫాలో ఆన్ ఇచ్చినా గిల్ సరైన వ్యూహాలను అమలు చేయలేదని విమర్శలు వచ్చాయి. లంక బ్యాటర్ సోనాల్ దినుషను అడ్డుకోవడంలో టీమ్ఇండియా విఫలమైందని భారత మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ ఆక్షేపించాడు. అదే విరాట్ కోహ్లీ అక్కడుంటే పరిస్థితి మరోలా ఉండేదని వ్యాఖ్యానించాడు. ''టెస్టు క్రికెట్ ఆడటం అందరికీ సూట్ కాదు బాస్.. ఇది సుదీర్ఘమైన ఫార్మాట్ గేమ్. బౌలింగ్ ఎటాక్‌ను కొనసాగిస్తూనే ఉండాలి. ఎందుకో.. ఈ మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ ఆడుంటే తప్పకుండా భారత్ విజయం సాధించేదేమో అనిపించింది. నిరంతరం అప్రమత్తంగా ఉంటూ జట్టు సహచరుల్లో ఉత్సాహాన్ని నింపుతాడు. ఈ మ్యాచ్‌లో బౌలింగ్ చేస్తూ ఉంటే చాలు ఫలితం దక్కుతుందని.. బంతి బాగా



తిరుగుతుంది కాబట్టి వికెట్ వస్తుందనుకొని తేలిగ్గా తీసుకున్నట్టుగా అనిపిస్తోంది. మన ఎనర్జీ లెవల్స్ తగ్గుతున్నప్పుడు విరాట్ ఉండుంటే.. ప్రతి ఒక్కరినీ ఉత్సాహపరిచేవాడు. ప్రత్యర్థులపై మాటలతో రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తోన్న సర్ఫరాజ్, యశస్వి జైస్వాల్‌ను ఇంకా ప్రోత్సహించేవాడు. సోనాల్‌నూ కోహ్లీ వెంటాడేవాడు. కానీ, ఈ జట్టులోని ఆటగాళ్లు మాత్రం కుమార వంటి లోయర్ ఆర్డర్ బ్యాటర్‌ను రెచ్చగొట్టేందుకు ప్రయత్నించడం చూశాం'' అని కైఫ్ అన్నాడు.

**ఒత్తిడి పడలేదు..**

''ఈ మ్యాచ్‌లో సోనాల్‌నే ఔట్ చేయాలి. అతడు చాలా ఆత్మవిశ్వాసంతో కనిపించాడు. లాహిరు కుమారతో తమ భాషలో 'వాళ్ల ముఖాలు చూడు' అని భారత ప్లేయర్లను అంటున్నట్లుగా ఓ వీడియో చూశా. ఓ వైపు టెయిలెండర్లు మాత్రమే ఉన్నా.. సోనాల్ మాత్రం ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా కనిపించాడు. మనవాళ్ల స్లెడ్జింగ్ అసలు అతడిపైనే జరిగినట్లు అనిపించలేదు. ఎంతసేపూ కుమార, ప్రభాత్ జయసూర్యనే లక్ష్యం చేసుకోవడం కనిపించింది. అలాగే, పెద్ద ప్లేయర్ అతడికి దగ్గరగా తిరుగుతూ మానసికంగానూ ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేయలేదు. మొన్నటి వరకూ విరాట్ కోహ్లీ, రోహిత్, అశ్విన్, ధోని.. ఇలాంటి ప్లేయర్లను దగ్గరగా చూస్తే ప్రత్యర్థి కుర్రాళ్లు కాస్త కంగారు పడేవారు. ఒత్తిడి పెంచుకొనేవాళ్లు. ఎందుకో.. ఈసారి అలాంటి పరిస్థితిని మనం కోల్పోయామని అనిపించింది'' అని కైఫ్ వెల్లడించాడు.

# మహిళల క్రికెట్‌లో అనయ బంగర్‌ను ఎలా ఆడిస్తారు?: కాప్ తీవ్ర అభ్యంతరం

అనయ బంగర్ (Anaya Banger).. లింగ మార్పిడి చేయించుకుని అమ్మాయిగా మారిన ఓ అబ్బాయి. భారత మాజీ క్రికెటర్ సంజయ్ బంగర్ కుమార్తె. అంతకుముందు దేశవాళీలో సర్ఫరాజ్ ఖాన్, అభిషేక్ శర్మ వంటి యువ భారత ఆటగాళ్లతో కలిసి ఆడిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మహిళగా మారిన తర్వాత తన క్రికెట్ కలను నెరవేర్చుకొనేందుకు ఐసీసీపైనే పోరాటం చేసింది. అయితే, ఆస్ట్రేలియా క్రికెట్ సంఘం ఆమెకు మద్దతుగా నిలిచింది. మహిళల బిగ్‌బాష్ లీగ్‌లో ఆడేందుకు అవకాశం ఇచ్చింది. కానీ, ఇప్పుడు అనయ అవకాశాలకు గండిపడేలా ఉంది. దానికి కారణం దక్షిణాఫ్రికా ప్లేయర్ మరిజెన్నె కాప్ తీవ్ర స్థాయిలో అభ్యంతరం వ్యక్తం చేయడం. ఈ మేరకు తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీగా పెట్టడం గమనార్హం.

''ఇలాంటి నిర్ణయం అత్యంత దారుణం. అనుమతి ఇవ్వడానికి వీల్లేదు. ట్రాన్స్‌జెండర్ క్రికెటర్ మహిళల బిగ్‌బాష్‌ను ఆడేందుకు ఎలా వీలవుతుంది'' అని కాప్ అభ్యంతరం వ్యక్తం చేసింది. మార్చి 2027లో మొదలయ్యే మహిళల బిగ్‌బాష్‌లో (Women Bigbash League) ఆడతానని ఇటీవల అనయ ప్రకటించిన తర్వాత కాప్ ఈ మేరకు పోస్టు చేసింది. ఆసీస్ బోర్డు నిర్ణయంపై వ్యతిరేకత వ్యక్తం చేసిన తొలి క్రికెటర్ కాప్. ఈ దక్షిణాఫ్రికా స్టార్ ఆల్‌రౌండర్ అయిన ఆమె బిగ్‌బాష్‌లోనూ ఆడుతోంది.

**ఐసీసీ అనుమతి లేదు..**

ఐసీసీ (ICC) 2023 నుంచి అమలు చేస్తోన్న పాలసీ ప్రకారం.. ట్రాన్స్‌జెండర్ మహిళలకు అంతర్జాతీయ మహిళా క్రికెట్ ఆడేందుకు అనుమతి లేదు. కానీ, ఆస్ట్రేలియా దేశవాళీ నిబంధనలు ఇందుకు




పూర్తిగా భిన్నం. కమ్యూనిటీ, ప్రీమియర్ క్రికెట్ ఆడేందుకు అనయకు అవకాశం కల్పించింది. అర్హత ప్రక్రియను అనుసరించే అనుమతి ఇచ్చినట్లు ఇటీవల ఓ ప్రకటనలో తెలియజేసింది. కాప్ విమర్శల నేపథ్యంలో.. ఇప్పుడు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి మరి!

# రక్షా బంధన్ ఎప్పటికీ నా ఫేవరెట్: ఇర్ఫాన్ పఠాన్

సోదర సోదరీమణుల మధ్య అనుబంధానికి ప్రతీకగా రక్షాబంధన్ నిర్వహించుకుంటాం. ఈ సందర్భంగా భారత మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్ పోస్టు పెట్టాడు. ఈ బంధం ఎప్పటికీ విడదీయలేనిదని పేర్కొన్నాడు. ''నాకు ఎంతో ఇష్టమైంది రక్షా బంధన్. చాలా అందమైన పండగ. సోదర సోదరీమణుల మధ్య విడదీయరాని అనుబంధానికి గుర్తుగా చేసుకుంటాం. ప్రేమ, మరిచిపోలేని జ్ఞాపకాలు, చిరునవ్వులు, అప్పుడప్పుడు ఫైట్లు, ఏడిపించుకోవడం, ఒకరికొకరు మద్దతుగా నిలవడం.. ఇలాంటివి ఎన్నో ఆప్యాయతలు అందులో ఉంటాయి. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరికీ శుభాకాంక్షలు. హ్యాపీ రక్షా బంధన్. ఈ బంధం చెక్కుచెదరకుండా మరింత బలోపేతం కావాలని ఆకాంక్షిస్తున్నా'' అని పఠాన్ పోస్టు చేశాడు.

**విరాట్ కోహ్లీ సోదరి..**

టీమ్ఇండియా స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ సోదరి భావన రాఖీ పండుగ సందర్భంగా ప్రత్యేకంగా పోస్టు చేశారు. విరాట్ సోదరుడు వికాస్‌కు రాఖీ కడుతూ ఉన్న ఫొటోను ఆమె షేర్ చేస్తూ.. ''జీవితం మనల్ని ఏ స్థాయికి తీసుకెళ్లినా.. నా ఆశీస్సులు ఎప్పుడూ మీతోనే ఉంటాయి'' అని భావన పోస్టు పెట్టారు.






# మోదీ ప్రభుత్వ లక్ష్యం..
# ప్రపంచ క్రీడా గమ్యస్థానంగా భారత్

**: అమిత్ షా**

భారత్ వేదికగా 2030 కామన్వెల్త్ గేమ్స్ జరగనున్నాయి. ఇక 2036 ఒలింపిక్స్ నిర్వహణ కోసం బిడ్డింగ్‌ను వేసేందుకు సిద్ధమవుతోంది. ఈ క్రమంలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా, కేంద్ర క్రీడల మంత్రి మాన్‌సుఖ్ మాండవీయ, గుజరాత్ డిప్యూటీ సీఎం హర్ష్ సంఘావి సమీక్ష నిర్వహించారు. గురువారం నిర్వహించిన ఈ భేటీ వివరాలను అమిత్ షా తన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేశారు. కామన్వెల్త్ గేమ్స్ సన్నద్ధతపై చర్చించామని.. ఒలింపిక్స్ కోసం బిడ్‌పైనా సమీక్షించినట్లు వెల్లడించారు. ''మోదీ ప్రభుత్వం పెద్ద లక్ష్యంతో పనిచేస్తోంది. అంతర్జాతీయ క్రీడా గమ్యస్థానంగా భారత్‌ను నిలపడమే మా ముందున్న టార్గెట్. భారీ ఈవెంట్లను నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటాం. అందుకోసం సమీక్ష సమావేశం నిర్వహించాం. 2036 ఒలింపిక్స్ కోసం బిడ్డింగ్ దాఖలుపై చర్చించాం. అహ్మదాబాద్ వేదికగా 2029 పోలీస్ అండ్ ఫైర్ గేమ్స్, 2030 కామన్వెల్త్ గేమ్స్ సన్నాహాలపైనా సమీక్షించాం'' అని అమిత్ షా పోస్టు చేశారు. చివరిసారిగా 2010 కామన్వెల్త్ గేమ్స్‌కు భారత్ ఆతిథ్యం ఇచ్చింది. రెండు దశాబ్దాల తర్వాత మళ్లీ సీడబ్ల్యూజీ గేమ్స్‌కు హోస్ట్‌గా భారత్ నిలవనుంది. అహ్మదాబాద్ అందుకు వేదిక కానుంది. ఇక 2036 ఒలింపిక్స్‌నూ అహ్మదాబాద్‌లోనే నిర్వహించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీతోనూ గుజరాత్ డిప్యూటీ సీఎం సంఘావి చర్చలు జరిపారు. 2029 ప్రపంచ పోలీస్ అండ్ ఫైర్ గేమ్స్‌కూ భారతే వేదిక. దాదాపు 70 దేశాల నుంచి 10వేల మందికిపైగా అథ్లెట్లు హాజరు కానున్నారు. ఇలాంటి భారీ ఈవెంట్‌కు అవసరమైన భద్రతా చర్యలను కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా పర్యవేక్షిస్తున్నారు. ఈ క్రమంలోనే క్రీడల మంత్రితో కలిసి సమీక్ష సమావేశాలను నిర్వహిస్తున్నారు.



# మేనకగా ప్రిషా సింగ్

టాలీవుడ్‌లో కొత్తతరం కథానాయికగా తనదైన గుర్తింపు కోసం ప్రయత్నిస్తున్న నటి ప్రిషా సింగ్. తొలి చిత్రాలు భారీ విజయాలు సాధించకపోయినా.. అందం, స్కీన్ ప్రెజెన్స్, సహజ నటనతో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. నిఖిల్ సిద్ధార్థ్ నటించిన 'స్పై'తో తెలుగు తెరకు పరిచయమైన ఆమె.. ఆ తర్వాత అల్లు శిరీష్ 'బడ్డీ'లో ఎయిర్ హోస్టెస్‌గా కనిపించి మెప్పించింది. ప్రస్తుతం కథల ఎంపికలో ఆచితూచి అడుగులు వేస్తున్న ఈ ముంబయి భామ.. గ్లామర్‌తో పాటు నటనకు ఆస్కారమున్న పాత్రలపై దృష్టి సారించింది. సినిమాలతో పాటు సామాజిక మాధ్యమాల్లోనూ ప్రిషాకు మంచి ఆదరణ ఉంది. ఇక ప్రస్తుతం అల్లరి నరేష్ కథానాయకుడిగా రూపొందుతున్న 'రంభ ఊర్వశి మేనక' చిత్రంలో టైటిల్ పాత్రలో ప్రిషా సింగ్ నటిస్తోంది. సినిమాల మధ్య గ్యాప్ రావడం కూడా తన కెరీర్‌ను దృష్టిలో పెట్టుకునే తీసుకున్న నిర్ణయమని తెలిపింది. 'హాస్య మూవీస్' సంస్థ, దర్శకుడిని కలిసిన తర్వాత సుమారు రెండు మూడు నెలల పాటు సాగిన ప్రీ–ప్రొడక్షన్ ప్రక్రియలో కథను అర్థం చేసుకున్నానని.. ముగ్గురు మహిళా పాత్రల్లో ప్రాధాన్యత ఉన్న పాత్ర కోసం తనను ఎంపిక చేశారని వెల్లడించింది. ఈ చిత్రంలో అల్లరి నరేశ్‌తో కలిసి పనిచేయడం తనకు మంచి అనుభవాన్ని ఇచ్చిందని ప్రిషా చెప్పింది. సెట్స్‌లో ఆయన ఎప్పుడూ తన సీనియారిటీని చూపించలేదని పేర్కొంది. ఆయన నుంచి నటనతో పాటు సెట్స్‌లో ఉండే తీరును కూడా నేర్చుకున్నానని చెప్పింది. అల్లరి నరేశ్ సినిమాల్లో తనకు 'నాంది' ఎంతో ఇష్టమని ప్రిషా వెల్లడించింది. ప్రస్తుతం ఈ సినిమాపై ఆశలు పెట్టుకున్నది ప్రిషా. చాలాకాలం గ్యాప్ తర్వాత నటిస్తున్న ఈ మూవీ తన సినీ ప్రయాణంలో మరో కీలక అడుగుగా నిలుస్తుందని భావిస్తోంది.



# బయోపిక్‌లో నేషనల్ క్రష్

లెజెండరీ సింగర్ ఎంఎస్ సుబ్బులక్ష్మి జీవిత కథతో తెలుగులో ఓ సినిమా రాబోతున్నట్లు చాలా కాలంగా ప్రచారం జరుగుతోంది. జెర్సీ ఫేమ్ గౌతమ్ తిన్ననూరి ఈ బయోపిక్‌కు దర్శకత్వం వహించనున్నారు. గీతా ఆర్ట్స్ సమర్పణలో బన్నీవాసు ఈ పాన్ ఇండియన్ సినిమాను నిర్మిస్తున్నారు. సుబ్బులక్ష్మి పాత్రలో నటించే హీరోయిన్ దగ్గరే మేకర్స్ కొద్ది నెలలుగా తర్జనభర్జనలు పడుతున్నారు. తొలుత ఈ బయోపిక్‌లో హీరోయిన్‌గా సాయిపల్లవి పేరు వినిపించింది. రామాయణతో పాటు రెండు తమిళ సినిమాలతో బిజీగా ఉన్న సాయిపల్లవి ఈ బయోపిక్‌ను రిజెక్ట్ చేసింది. ఆ తర్వాత రుక్మిణి వసంత్ పేరు తెరపైకి వచ్చింది. చివరకు రూమర్‌గానే మిగిలిపోయింది. తాజాగా ఈ బయోపిక్‌లో రష్మిక మందన్న టైటిల్ రోల్‌లో కనిపించబోతున్నట్లు సోషల్ మీడియాలో వార్తలు వినిపిస్తున్నాయి. ఇటీవలే రష్మికను కలిసి డైరెక్టర్ గౌతమ్ తిన్ననూరి ఎంఎస్ సుబ్బులక్ష్మి కథను వినిపించినట్లు సమాచారం. బాలీవుడ్‌తో పాటు దక్షిణాదిలో రష్మికకు ఉన్న క్రేజ్ ఈ బయోపిక్‌కు ప్లస్సవుతుందని మేకర్స్ భావిస్తున్నట్లు తెలిసింది. కథ విన్న రష్మిక తన నిర్ణయాన్ని మాత్రం చెప్పలేదని అంటున్నారు.




# ట్రిపుల్ రోల్‌లో బన్నీ ?

కెరీర్‌లో ఫస్ట్ టైమ్ రాకా కోసం అల్లు అర్జున్ ఓ వెరైటీ ప్రయోగానికి సిద్ధమయ్యాడు. దాదాపు 1300 కోట్ల బడ్జెట్‌తో సైంటిఫిక్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతోన్న ఈ మూవీకి కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ పాన్ ఇండియన్ మూవీలో దీపికా పదుకోణ్, రష్మిక మందన్న, మృణాల్ ఠాకూర్, జాన్వీ కపూర్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ సినిమాలో అల్లు అర్జున్ ట్రిపుల్ రోల్ చేయబోతున్నట్లు సమాచారం. తండ్రితో పాటు ఇద్దరు కొడుకులుగా అల్లు అర్జున్ రాకాలో కనిపిస్తాడని అంటున్నారు. మూడు పాత్రల మధ్య అల్లు అర్జున్ చూపించే వేరియేషన్ సినిమాకు హైలైట్‌గా ఉంటుందని టాక్. తండ్రి పాత్రలో వయసు మళ్లిన వ్యక్తిగా బన్నీ నటన సర్‌ప్రైజింగ్‌గా ఉండబోతున్నట్లు సమాచారం. అల్లు అర్జున్ ఇప్పటివరకు డ్యూయల్ రోల్ కూడా చేయలేదు. ఫస్ట్ టైమ్ ఏకంగా ట్రిపుల్ రోల్‌లో కనిపించనుండటం అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

## ఈ వారం ఓటీటీలో రిలీజైన సినిమాలు, వెబ్‌సిరీస్‌లు ఇవే

| | |
|---|---|
| **నెట్‌ఫ్లిక్స్ :** | అల్ఫా (హిందీ)<br>ది లాస్ట్ సెల్యూట్ (ఇంగ్లీష్)<br>ది విష్పర్ మ్యాన్ (ఇంగ్లీష్) |
| **జియో హాట్ స్టార్ :** | పార్ట్ టైమర్స్ (తెలుగు వెబ్‌సిరీస్)<br>ఐ నోబడీ (మలయాళం)<br>మైఖేల్ (ఇంగ్లీష్) |
| **సోనీ లివ్ :** | అన్బే దయానా (తమిళం) |
| **అమెజాన్ ప్రైమ్ :** | కేజీక్యూ (తెలుగు)<br>నాగబంధం (హిందీ)<br>బబితా సింగ్ రిపోర్టింగ్ (హిందీ)<br>బ్యాట్‌మ్యాన్ (ఇంగ్లీష్)<br>ది లాస్ట్ సన్‌రైజ్ (ఇంగ్లీష్) |
| **ఈటీవీ విన్ ఓటీటీ :** | న్యూటన్స్ థర్డ్ లా (తెలుగు) |
| **ఆహా ఓటీటీ:** | ఆకలి రాజ్యం (తెలుగు వెబ్ సిరీస్)<br>హరుడు (తెలుగు) |
| **జీ5 ఓటీటీ :** | బందర్ (హిందీ) |



### రవితేజకు జోడీగా
# ఐశ్వర్య రాజేశ్

సంక్రాంతి సెంటిమెంట్‌ను మరోసారి కొనసాగించేందుకు ఐశ్వర్య రాజేశ్ సిద్ధమవుతోంది. వెంకటేశ్ హీరోగా నటించిన 'సంక్రాంతికి వస్తున్నాం'తో 2025 సంక్రాంతి బరిలో ఘన విజయాన్ని అందుకున్న ఆమె.. మాస్ మహారాజా రవితేజ సరసన నటించే అవకాశాన్ని దక్కించుకున్నది. ఈ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న కొత్త చిత్రం 2027 సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది. దీంతో ఐశ్వర్య కెరీర్‌లో ఈ ప్రాజెక్ట్ ప్రత్యేకంగా నిలవనుంది. రవితేజ ప్రస్తుతం 'ఇరుముడి' సక్సెస్ అందుకున్నాడు. చాలాకాలం తర్వాత విజయం అందుకున్న జోష్‌లోనే కొత్త చిత్రాన్ని కూడా వేగంగా ప్రారంభించేందుకు ఆయన సిద్ధమయ్యారు. 'రాజ రాజ చోర' ఫేమ్ హసిత్ గోలి దర్శకత్వంలో రూపొందనున్న ఈ సినిమా షూటింగ్ సెప్టెంబర్ తొలి వారంలో ప్రారంభం కానుంది. ఈ సినిమాలో ఐశ్వర్య రాజేశ్‌ను కథానాయికగా ఎంపిక చేసినట్లు చిత్ర వర్గాలు వెల్లడించాయి.